

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 14-04-2026 | సంపుటి - 27 | సంచిక -322 | రూ : 4 | పేజీలు: 8




## విధివిధానాలు సమర్పించే దాకా

# హైడ్రా కూల్చివేతలొద్దు

- జలాశయాలు, రోడ్ల పరిరక్షణ చర్యలు కొనసాగించొచ్చు
- ఐలాపూర్ భూములపై యథాతథస్థితి
- మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు

హైదరాబాద్: హైడ్రాకు సంబంధించిన విధివిధానాలు, మార్గదర్శకాలను సమర్పించాలని.. అప్పటివరకు ఎలాంటి అక్రమ, అనధికార నిర్మాణాల కూల్చివేతలు చేపట్టరాదంటూ హైడ్రాను ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే చెరువులు, నీటి వనరులు, నాలాలు, పార్కులు, ప్రజా రహదారుల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టవచ్చని పేర్కొంది. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల చట్టం.. లేదంటే ఏ ఇతర చట్టాల కింద హైడ్రా విధులకు సంబంధించి ప్రామాణిక కార్యాచరణ విధానాలు లేదా మార్గదర్శకాలను కోర్టు ముందుంచితే తప్ప ఎలాంటి అంతర్గత రహదారులు, ప్రహరీల తొలగింపు వంటి బలవంతపు

తరువాయి 2లో

# మోడీ కుట్ర దేశానికే ప్రమాదం

- హైబ్రిడ్ మోడల్ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపట్టాలి
- ప్రస్తుతమున్న సీట్ల మేరకే
- 33శాతం మహిళా రిజర్వేషను అమలు చేయాలి
- నాడు బీజేపీ సహకరించకపోవడం వల్లే ఆ బిల్లు ఆమోదం పొందలేదు
- 2026 జనాభా లెక్కలు తేలిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన
- 2011 జనాభా లెక్కలతో దక్షిణాది, ఉత్తరాది మధ్య అగాధం
- పన్నులు చెల్లించి, సలాం కొట్టేందుకు మేం వ్యతిరేకం
- 40 ఏండ్లలో ఒక్క మహిళకైనా
- బీజేపీ అధ్యక్ష పదవిని కట్టబెట్టిందా? : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

2లో




భారతదేశం సరికొత్త చరిత్రను

## లిఖించనుంది: ప్రధాని

- 21వ శతాబ్దంలోనే అతిపెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతోందన్న మోదీ
- భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు బలోపేతం చేస్తారన్న మోదీ
- సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోందన్న మోదీ

2లో





హర్మూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు

## టోల్ ఫీజు లేదు: ఇరాన్ రాయబారి

- ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్న మహమ్మద్ ఫతాలీ
- తమ డిమాండ్లకు అమెరికా అంగీకరిస్తేనే చర్చలు అన్న ఫతాలీ
- ఇరాన్ సామర్థ్యం గురించి అమెరికాకు తెలుసని వ్యాఖ్య

2లో

## ఈ రోజు శ్రీకాకుళం జిల్లాకు

# ఒక చారిత్రాత్మకమైన రోజు

- శ్రీకాకుళంతిరుపతి మధ్య తొలి రెగ్యులర్ రైలు సేవలు ప్రారంభం
- నెరవేరిన సిక్కోలు ప్రజల 75 ఏళ్ల చిరకాల స్వప్నం
- అరసవల్లిని తిరుమల పుణ్యక్షేత్రంతో అనుసంధానించనున్న హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా రైలుకు పచ్చజెండా
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి అని వ్యాఖ్య

2లో






హైదరాబాద్ నగరంలో

## రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

- 2026-27 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక విద్యుత్ వినియోగం నమోదు
- సాయంత్రం 4,381 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదు
- గ్రేటర్ చరిత్రలో 2026 మార్చి 3న 4,421 మెగావాట్ల విద్యుత్ వినియోగం

2లో

## అశ్రునయనాల మధ్య

# ఆశా భోంస్లేకు తుది వీడ్కోలు...

- ముంబై శివాజీ పార్క్‌లో ఆశా భోంస్లే అంత్యక్రియలు పూర్తి
- ప్రభుత్వ లాంఛనాలతో తుది వీడ్కోలు పలికిన ప్రముఖులు
- పోలీసుల గౌరవ వందనంతో నివాళి
- 92 ఏళ్ల వయసులో బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో కన్నుమూత
- ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ సంగీత ప్రస్థానం ముగింపు

2లో



# మోడీ కుట్ర దేశానికే ప్రమాదం

హైదరాబాద్ : నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను 50 శాతం పెంచి డీలిమిటేషన్ చేపట్టాలనే ప్రధాని మోడీ విధానం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర విఘాతాన్ని కలిగిస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశానికే పెద్ద విపత్తులాంటిదని ఆయన హెచ్చరించారు. ఈ విధానంతో 542 ఉన్న సీట్లకు అదనంగా 270 సీట్లు పెరుగుతాయని తెలిపారు. వీటిని 2026 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2011 జనాభాల లెక్కల ప్రకారం తీసుకోవడం వల్ల దక్షిణాదికి తీరని నష్టం వాటిల్లుతుం దని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రధాని మోడీ రాజకీయ కుట్రగా అభివర్ణించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పలువురు మంత్రులు, ఎంపీలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. మోడీ తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అనేవి ఒకటి కాదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని, వెంటనే ఆ బిల్లును ఆమోదించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు గతంలో బీజేపీ సహకరించకపోవడం వల్లే లోక్‌సభలో ఆగిపోయిందని విమర్శించారు. నియోజక వర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్రం హడావుడిగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మోడీ సర్కారు వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను రెండింటినీ ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడం లేదంటూ ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలకు ఒకదాని కొకటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రెండింటిని విడదీసి వేర్వేరుగా చర్చించి, వాటి అమలుపై విధివిధానాలు రూపొందించాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని మోడీ ఇంతకాలం పట్టించుకోలేదని సీఎం విమర్శించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతునిచ్చిందని గుర్తు చేశారు. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చారనీ, అప్పుడు రాజ్యసభలో అది ఆమోదం పొందిందని తెలిపారు. అందులోనూ బీసీ కోటా ఉండాలనేది తమ పార్టీ నిర్ణయమని చెప్పారు. పురుషులతోపాటు మహిళలకూ ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. అప్పటికి ప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదని, పురుషులతోపాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించామని గుర్తు చేశారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్‌సభ స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని అన్నారు. రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకొచ్చారని గుర్తు చేశారు. 40 ఏండ్లలో బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని ఒక్క మహిళకైనా ఇచ్చారా? అని ఆ పార్టీ నేతలను ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజరు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఆ చట్టాన్ని సవరించండి**

2026 జనాభా లెక్కల గెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామంటూ బీజేపీ ప్రభుత్వం చట్టం చేసిందని సీఎం గుర్తు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 543 లోక్‌సభ సభ్యుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, 181 మంది మహిళలు ఎన్నికయ్యేందుకు అవకాశం ఉండేదన్నారు. ఆ చట్టాన్ని లోక్‌సభలో ఆమోదించినప్పుడే అమలు కాకుండా బీజేపీ అడ్డుకుందని గుర్తు చేశారు. ఆ రకంగా మహిళలకు రిజర్వేషన్లను దూరం చేసిందని విమర్శించారు. 2026 జనాభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టాన్ని ముందుకు తెస్తున్నారని తెలిపారు. 2026 జనాభా లెక్కల ప్రకారమనే నిబంధనను సవరించుకుంటే, 2029 లోక్‌సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల అమలుకు అవకాశం ఉంటుందని సూచించారు. మహిళా రిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంలో బీజేపీ రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. నియోజకవర్గాల పునర్విభజనను ప్రధాని మోడీ రాజకీయ పావుగా, ప్రమాదకరంగా వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు పకడ్బందీగా అమలు చేయడం వల్ల ఆయా రాష్ట్రాల్లో జనాభా తగ్గిందని సీఎం చెప్పారు. ఉత్తరాదిలో కుటుంబ నియంత్రణ అమలు కాకపోవడంతో జనాభా విపరీతంగా పెరిగిందని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ ఈ విషయాన్ని గుర్తించి, లోక్‌సభ సీట్ల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిర్ణయించారని తెలిపారు. 25 ఏండ్ల వరకు సీట్ల పెంపుదలను ఆమె నిషేధించారని గుర్తు చేశారు. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన జరగొద్దనే ఉద్దేశంతోనే ఈ చర్య తీసుకున్నారని వివరించారు. 2001లో నాటి ప్రధాని వాజ్‌పారు పునర్విభజనపై చట్ట సవరణ చేశారనీ, దాని వల్ల 2009లో తెలంగాణకు 17 ఎంపీ సీట్లు, ఆంధ్రప్రదేశ్‌కు 25 ఎంపీ సీట్లు వచ్చాయన్నారు. తెలంగాణకు 119 అసెంబ్లీ సీట్లు, ఏపీకి 175 శాసనసభ సీట్లు వచ్చాయని చెప్పారు. ఆ తర్వాత 2026 వరకు చట్టపరంగా సీట్ల పెంపుదలపై నిషేధం విధించారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజనకు ఒప్పుకోబోమంటూ దక్షణాది రాష్ట్రాలు నిరసన తెలపడంతోపాటు ప్రధానికి లేఖ రాశాయని గుర్తు చేశారు. ఆయా రాష్ట్రాలు ఒప్పుకోబోమని చెప్పడంతోనే దామాషా ప్రకారం యాభై శాతం ఎంపీ సీట్లు పెంచుతామంటూ కేంద్రం చెబుతున్నదని విమర్శించారు. 20 ఎంపీ సీట్లు ఉన్న కేరళకు, 80 సీట్లు ఉన్న యూపీకి ప్రస్తుతం అంతరం 60 సీట్లు మాత్రమేనని గుర్తు చేశారు. యాభై శాతం సీట్లు పెంచితే ఆ గ్యాప్ 90 సీట్లకు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణకు, యూపీకి 94 సీట్ల అంతరం ఉంటుందన్నారు. దక్షణాదిలో మొత్తం 130 ఎంపీ సీట్లు ఉన్నాయనీ, యాభై శాతం పెరిగితే 195 అవుతాయని తెలిపారు. ఉత్తరాదిలో ప్రస్తుతం 413 సీట్లు ఉన్నాయనీ, దీని ప్రకారం అక్కడ సీట్ల సంఖ్య 621కు పెరుగుతుందని చెప్పారు. డీలిమిటేషన్ ద్వారా ఎంపీ సీట్ల సంఖ్యను 1957లో 494కు, 1967లో 520కు, 1976లో 542కు, పెంచారని వివరించారు. ఆ తర్వాత సిక్కిం నుంచి ఒక సీటు పెరిగి 543కు ఆ సంఖ్య చేరిందని గుర్తు చేశారు. ఢిల్లీకి పన్నులు చెల్లించి, సలామ్ కొట్టడానికి తాము వ్యతిరేకమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

హైదరాబాద్, ఏప్రిల్ 13: హైదరాబాద్ నగరంలో విద్యుత్ వినియోగం ఏప్రిల్ 13న రికార్డు స్థాయికి చేరుకుంది. 202627 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైనట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. నేడు సాయంత్రం 16.01 గంటలకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 4,381 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ వినియోగం నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ, ఇప్పటి వరకు ఇది అత్యధికం. గ్రేటర్ హైదరాబాద్ చరిత్రలో 2026 మార్చి 3వ తేదీన 4,421 మెగావాట్ల విద్యుత్ వినియోగంతో ఇప్పటి వరకు ఆల్ టైమ్ రికార్డుగా ఉంది. రోజురోజుకు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతూ వినియోగదారులకు అవాంతరాలు ఎదురుకాకుండా విద్యుత్ సరఫరా సాగిస్తున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. భవిష్యత్తులో మరింత డిమాండ్ పెరిగినా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

## హర్మూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు: ఇరాన్ రాయబారి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 : హర్మూజ్ జలసంధి గుండా వెళుతున్న భారతీయ చమురు ట్యాంకర్ల నుంచి తాము ఎలాంటి టోల్ ఫీజును వసూలు చేయడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత క్లిష్ట సమయంలోనూ సానుకూల సంబంధాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. భారత్‌తో ఉన్న మైత్రి కారణంగా రవాణా ఉచితంగా సాగుతోందని అన్నారు. అమెరికాతో చర్చలు పునఃప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ తమ డిమాండ్లకు అనుకూలంగా స్పందించాలని స్పష్టం చేశారు. మా షరతులను అమెరికా అంగీకరిస్తే, మరో విడత చర్చలు సాధ్యమవుతాయని అన్నారు. ఇటీవల తాత్కాలిక యుద్ధ విరమణ అనంతరం చర్చల సందర్భంగా అమెరికా అంగీకార యోగ్యం కాని డిమాండ్లు తమ ముందు ఉంచిందని పేర్కొన్నారు. అందుకే చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిందని అన్నారు. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై మహమ్మద్ ఫతాలీ స్పందిస్తూ, ఇరాన్ సామర్థ్యం గురించి వాషింగ్టన్‌కు తెలుసని అన్నారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో, భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

## అశ్రునయనాల మధ్య ఆశా భోంస్లేకు తుది వీడ్కోలు... ముంబైలో ముగిసిన అంత్యక్రియలు

ముంబై, ఏప్రిల్ 13: భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. దిగ్గజ గాయని, స్వర సామ్రాజ్ఞి ఆశా భోంస్లే (92) పంచభూతాల్లో లీనమయ్యారు. ముంబైలోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో సోమవారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. సూర్యాస్తమయ వేళ, అశ్రునయనాల మధ్య ఆమెకు తుది వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, అభిమానుల సమక్షంలో వేద మంత్రోచ్ఛారణలతో తుది సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ బ్యాండ్ సభ్యులు 'లాస్ట్ పోస్ట్' వాయిస్తూ ఆమెకు సైనిక లాంఛనాలతో నివాళి అర్పించారు. అంతకుముందు ఆమె నివాసం నుంచి శివాజీ పార్క్ వరకు భారీ ఊరేగింపుతో అంతిమయాత్ర సాగింది. ఆశా భోంస్లే ఏప్రిల్ 12న ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతో ఆసుపత్రిలో చేరినట్లు తొలుత వార్తలు వచ్చినా, ఛాతీ ఇన్ఫెక్షన్, తీవ్రమైన అలసట కారణంగా ఆమె మరణించినట్లు మనవరాలు జానై భోంస్లే వెల్లడించారు. పదేళ్ల వయసులోనే మరాఠీ చిత్రంతో గాయనిగా ప్రస్థానం ప్రారంభించిన ఆశా భోంస్లే, ఎనిమిది దశాబ్దాలకు పైగా తన గానంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. 'ఉమ్రావ్ జాన్', 'తీస్రీ మంజిల్', 'రంగీలా' వంటి చిత్రాల్లో ఆమె పాడిన ఎన్నో గీతాలు అజరామరంగా నిలిచిపోయాయి. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'తౌబా తౌబా' పాటకు ఉత్సాహంగా డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ అయింది. ఆమె మరణంతో భారతీయ సంగీతంలో ఓ సువర్ణాధ్యాయం ముగిసినట్లయింది.

# ఈ రోజు శ్రీకాకుళం జిల్లాకు ఒక చారిత్రాత్మకమైన రోజు: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, ఏప్రిల్ 13 : శ్రీకాకుళం జిల్లా ప్రజల 75 ఏళ్ల చిరకాల స్వప్నం నెరవేరింది. జిల్లా చరిత్రలో తొలిసారిగా తిరుపతికి నేరుగా వెళ్లే రెగ్యులర్ రైలు సేవలు సోమవారం ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం రోడ్ తిరుపతి హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (17439/40) కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ రోజు శ్రీకాకుళం జిల్లాకు ఒక చారిత్రాత్మకమైన రోజని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయాన్ని, తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రక్షేత్రంతో ఈ రైలు అనుసంధానం చేస్తుందని తెలిపారు. దీనివల్ల వేలాది మంది భక్తులకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందన్నారు. ప్రయాణికులతో మాట్లాడినప్పుడు వారిలో కనిపించిన ఆనందం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ రైలు సేవ కేవలం ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు. ఈ కొత్త రైలు సేవను సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని ఎన్‌డీఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. ఇది కేవలం ఒక రైలు మాత్రమే కాదని, శ్రీకాకుళం ప్రజల ఆశలు, ఆకాంక్షలను అభివృద్ధికి అనుసంధానించే కీలక ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## విధివిధానాలు సమర్పించే దాకా హైడ్రా కూల్చివేతలొద్దు

హైదరాబాద్: హైడ్రాకు సంబంధించిన విధివిధానాలు, మార్గదర్శకాలను సమర్పించాలని.. అప్పటివరకు ఎలాంటి అక్రమ, అనధికార నిర్మాణాల కూల్చివేతలు చేపట్టరాదంటూ హైడ్రాను ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే చెరువులు, నీటి వనరులు, నాలాలు, పార్కులు, ప్రజా రహదారుల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టవచ్చని పేర్కొంది. జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీల చట్టం.. లేదంటే ఏ ఇతర చట్టాల కింద హైడ్రా విధులకు సంబంధించి ప్రామాణిక కార్యాచరణ విధానాలు లేదా మార్గదర్శకాలను కోర్టు ముందుంచితే తప్ప ఎలాంటి అంతర్గత రహదారులు, ప్రహరీల తొలగింపు వంటి బలవంతపు చర్యలు చేపట్టరాదని స్పష్టంచేసింది. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా హైడ్రా బృందం కూల్చివేతలను చేపట్టడాన్ని సవాల్ చేస్తూ అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రైతు ఎం.ఎ.షరీఫ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. తెల్లవారుజామున 4.30 సమయంలో భద్రతా సిబ్బంది, హైడ్రా అధికారులు హాజరై 100 ఏళ్లనాటి పూర్వీకుల ఆస్తిలోని నీటిట్యాంకు, కాంపౌండ్ కూల్చివేస్తూ యుద్ధ సంఘటనను తలపించారన్నారు. అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఉత్తర్వుల పేరుతో సర్వే నం.165 నుంచి 175, 212, 213లలోని 36.37 ఎకరాలకు ఇచ్చిన ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని పిటిషనర్లు వెయ్యికిపైగా ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. హైడ్రా కూల్చివేసిన భవనానికి అనుమతులు లేవని, విద్యుత్ కనెక్షన్ అనుమతి కూడా లేదన్నారు. ఇక్కడ ఉన్న ఏ నిర్మాణానికి అనుమతులు లేవన్నారు.

**కోర్టు ముందు వీడియో క్లిప్పింగ్‌లు..**

పిటిషనర్ సమర్పించిన వీడియో క్లిప్పింగ్‌లను న్యాయమూర్తి వీక్షించగా ఇందులో వందలకొద్దీ హైడ్రాకు చెందినవారు నీలం యూనిఫాంలో గుమిగూడి ఉన్నట్లు తేలింది. పిటిషనర్‌కు చెందిన పెద్దభవంతిని హైడ్రా కూల్చివేసింది. ఈ కూల్చివేతకు ముందు పిటిషనర్‌కు ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. సుప్రీంకోర్టు సహా ఇదే హైకోర్టు ఇచ్చిన పలు తీర్పుల్లో అక్రమ నిర్మాణాల తొలగింపుపై మార్గదర్శకాలను అమలుచేయాలని పేర్కొన్నాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఒక భారీ కట్టడాన్ని కూల్చివేయడం దిగ్భ్రాంతికి గురిచేస్తోందన్నారు. ఒకవేళ అనధికార నిర్మాణమని భావించినప్పటికీ అధికారులు మొదటి నుంచి ఎలా అనుమతించారనేది ఆశ్చర్యం కలిగిస్తోందని, ఆదిలోనే చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితులు అదుపులో ఉండేవన్నారు.

## తమిళనాడు విరుదునగర్‌లోని బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

* **ప్రమాదం సమయంలో ఫ్యాక్టరీలోనే 60 మంది కార్మికులు**
* **ఆసుపత్రికి తీవ్రంగా గాయపడిన బాధితుల తరలింపు**
* **కొనసాగుతున్న సహాయక చర్యలు, దట్టంగా కమ్ముకున్న పొగ**



తమిళనాడులోని విరుదునగర్ జిల్లాలోని ఓ బాణసంచా ఫ్యాక్టరీలో ఈరోజు ఉదయం భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో ఫ్యాక్టరీలోని ఐదు గదులు కూలిపోయాయి. వివరాల్లోకి వెళితే.. మడతుపట్టి ప్రాంతంలో ఉన్న 'ఎక్సెల్ ఫైర్‌వర్క్స్' అనే బాణసంచా తయారీ కేంద్రంలో ఈ ప్రమాదం జరిగింది. కార్మికులు విధుల్లో ఉండగా, ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మందుగుండు సామగ్రి పేలింది. పేలుడు ధాటికి ఫ్యాక్టరీ ప్రాంగణం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. కార్మికులు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో సుమారు 60 మంది కార్మికులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేస్తూ, లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పలువురిని అంబులెన్స్‌ల ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పేలుడుకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుంది : ప్రధాని నరేంద్రమోదీ

ముంబై, ఏప్రిల్ 13 : చట్టసభల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరలో చట్టం కానుందని, తద్వారా భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ 21వ శతాబ్దంలోనే అతి పెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతుందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఉద్దేశించి నేడు ఢిల్లీలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అత్యంత అవసరమని మోదీ అన్నారు. సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోందని తెలిపారు. ప్రతి పార్టీ దీనిని ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. 2029లోగా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని వ్యాఖ్యానించారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధి వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సెన్సస్ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

**– జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ అంకిత్**

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: సెన్సస్‌కు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో సెన్సస్-2027 ఏర్పాట్లపై డీసీఓ భారతి హోళీకేరి సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక చార్జ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలు అన్ని జిల్లాలు సమర్పించాల్సి ఉండగా, కొన్ని జిల్లాలు మాత్రమే వివరాలు అందించాయని, మిగతా జిల్లాలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఇళ్ల గణనకు సంబంధించి జిల్లా, మండల స్థాయిలో భూభాగ గణాంకాల్లో ఉన్న వ్యత్యాసాలపై కూడా చర్చించారు. వివిధ వనరుల నుండి వచ్చిన డేటాలో ఒకే డేటాను ఖరారు చేసి, జిల్లా సెన్సస్ అధికారి ద్వారా ధృవీకరించి పంపించాలని సూచించారు. ఇతర మార్గాల ద్వారా పంపిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. ఎన్యూమరేటర్ల మాన్యువల్స్, సూపర్వైజర్ కిట్స్, మ్యాప్స్ వంటి సెన్సస్ సామగ్రి పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. చార్జ్ అధికారులకు నేరుగా పంపబడే ఈ సామగ్రిని స్వీకరించి,




పరిమాణాన్ని ధృవీకరించాలని సూచించారు. అలాగే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసి, వంద శాతం లక్ష్యంతో పాటు అదనపు రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సెన్సస్-2027 కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని డీసీఓ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐడీఓసీ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో సెన్సస్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఇప్పటికే విస్తృత స్థాయిలో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సెన్సస్‌కు సంబంధించిన ప్రతి దశను సమయపాలనతో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, సంబంధిత శాఖల మధ్య సమన్వయం కల్పిస్తూ పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఓ సంజీవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఘనంగా ఇందిరమ్మ మహిళా శక్తి పథకం



ఖమ్మం జిల్లా , ప్రజాస్ఫూర్తి : ఖమ్మంలో మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు,మాజీ ఎమ్మెల్సీ బాలసాని. నగర మేయర్ నీరజ, కార్పొరేటర్స్, మైనార్టీ నాయకులు, కమిటీ నంబర్స్ పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ ప్రతి మహిళా కుట్టు మీషన్ తమ జీవనదారం చేసుకొని ఆర్థికంగా తమ కాళ్ళ మీద తాము నిలబడాలని, వారి పిల్లలకు మంచి చదువు మంచి భవిషత్తుకు దారులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జరుగుతుండగా కరెంట్ పోవడం కొస మెరుపు.

## ఇంటర్ లో రాష్ట్ర ర్యాంక్ లు సాధించిన మాస్టర్ మైండ్స్ విద్యార్థులు




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : ఇంటర్మీడియట్ ఫలితాలలో మాస్టర్ మైండ్స్ హైదరాబాద్ బ్రాంచ్ విద్యార్థులు ఈ ఏడాది కూడా రాష్ట్ర ర్యాంకులను సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 991 మార్కులతో గాయత్రి వర్ధిని, సిరినిత్య లు రాష్ట్రంలో మొదటి ర్యాంకును సాధించారు. ఇక మొదటి సంవత్సరం ఫలితాలలో వర్షా 500 మార్కులకు గాను 496 సాధించింది. ఎం ఇ సి విభాగంలో మరో విద్యాసంస్థకు దక్కనటువంటి అపూర్వ గౌరవం మాస్టర్ మైండ్స్ కు దక్కిందని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ద్వితీయ సంవత్సరంలో 980 మార్కులకు పైగా 50 మంది విద్యార్థులు సాధించారని, మొదటి సంవత్సరంలో 500 మార్కులకు గాను 490 మార్కులను 50 మంది విద్యార్థులకు పైగా వచ్చాయని వారు వెల్లడించారు. ఎం ఇ సి విభాగంలో అత్యున్నతమైన విద్యా ప్రమాణాలను అందించడం వల్లే తామీ ఘనతను సాధించామని పేర్కొన్నారు. ఎంఈసి తోపాటు మాస్టర్ మైండ్స్ విద్యార్థులు సి ఏ, సీఎంఏ, సి ఎస్ లాంటి కఠినమైన పోటీ పరీక్షలలో తమ ప్రతిభను చాటుతుండడం గొప్ప విషయం అన్నారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ మైండ్స్ హైదరాబాద్ బ్రాంచ్ జోనల్ అడ్మిన్ ప్రిన్సిపల్ ఎస్ వి ఆర్, ఎం ఎస్ వలి, అకాడమిక్ ప్రిన్సిపల్స్ ఆంజనేయ రెడ్డి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పంది పంపుల చింత రేవు వాగు పై నాలుగు కోట్ల రూపాయలతో బ్రిడ్జి మంజూరు



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి:బయ్యారం మండలంలో ఈ నెల 19న జరిగే పంది పంపుల, చింత రేవు వాగుపై నాలుగు కోట్ల రూపాయలతో బ్రిడ్జి శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) శంకుస్థాపన చేయనున్నారు. కిష్టాపురం, కాచనపల్లి, కోయగూడెం, కస్తూరి నగరం , కొత్తగూడెం గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు , గ్రామ పెద్దలు కలిసి వేదిక స్థలాన్ని పరిశీలిస్తూ వారితో పలు అంశాలు చర్చించినారు. మూడు గ్రామ పంచాయతీల నుంచి ప్రజలందరినీ భారీ సంఖ్యలో తరలించుకొని వేదిక దగ్గరికి తీసుకురావాలని వారు సూచించినారు. బయ్యారం మండలం మాజీ సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి మాట్లాడుతూ మీ గ్రామాల ప్రజలను మీ బాధ్యతతో అందరిని తీసుకొచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు యాలం రేవతి, బానోత్ లింగ, బానోత్ రవి,కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్షిక రాజు ,బానోత్ రాంబాబు ,బొమ్మల పాండురాజు ,కోరం సురేష్, పస్తం రవి ,దారావత్ శీను ,అల్లెం సాంబశివరావు, ఏప నాగరాజ్, బానోతు కిషన్, గుగులోతు రాజు, బానోత్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ట్రీ" అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్



నల్లగొండ, ప్రజా స్ఫూర్తి : సోమవారం క్లాక్ టవర్ సెంటర్లో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. జీవితం విలువైనది అనే సందేశంతో రోడ్డు సేఫ్టీ వృక్షాన్ని ప్రతీకగా చూపిస్తూ, మనిషి జీవితాన్ని రక్షించుకోవడం ఎంత ముఖ్యమో వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించినప్పుడు ప్రమాదం జరిగినా ఎలా రక్షణ లభిస్తుందో, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయో ప్రదర్శన ద్వారా ప్రజలకు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, డి టి ఓ లావణ్య ,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి,మోటారు ఇన్స్పెక్టర్లు కొండయ్య ,మల్లికార్జున్, భాస్కర్ రెడ్డి ,ఉషశ్రీ ,సోనిప్రియ, చిరంజీవి, గోపీనాథ్, నరేందర్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలి

ప్రజాస్ఫూర్తి , జన్నారం : రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ అన్నారు.సోమవారం రోజున గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో రోడ్డు సేఫ్టీ పై గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లకు డ్రైవింగ్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుష్మ భూమేష్ మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని, ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని,యువత డ్రగ్స్ కు బానిసలు కాకుండా చూడాలని కోరారు.



అనంతరం ఇటీవల ఉత్తమ పురస్కారం అందుకున్న 108 సిబ్బందిని రఫిక్, కిషన్ లను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఈవో రాహుల్, పంచాయతీ సిబ్బంది పలు వాహనాలు డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాల నివారణ: ఎస్పీ రోహిత్ రాజు

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రోడ్డు భద్రతా నియమాలను పాటించడం, స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో ఎంసిబి ఐటిఐ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన అరైవ్-అలైవ్ అవగాహనా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ రోడ్డుపై విధులలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా.. లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ, నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన



కలిగే ప్రమాదాల గురించి వివరించారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు. పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కమీషనర్ సుజాత, ఆర్టీఓ వెంకటరమణ, స్థానిక కార్పొరేటర్ నూకల సరిత, మెడికల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్, ఎన్‌హెచ్‌ఏఐ జేఈ మొహమ్మద్ అలీ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, ఎస్సైలు నాగరాజు, జీవన్, సుమారు 300 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో సదుపాయాలు కల్పించండి

*** ఎంపీ కొండకు అధికారుల వినతి**

రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని రంగారెడ్డి జిల్లా గజిటెడ్ అధికారుల సంఘం నాయకులు చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. శంషాబాద్ మండలంలో జరిగిన కార్యక్రమంలోపాల్గొన్న ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి ని కలిసిన అధికారులు పలు అంశాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని 500 ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళకు మరుగుదొడ్లు నిర్మాణం, ఆర్.వో వాటర్ ప్యూరిఫైయర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ని కార్యాలయాలలో మరుగుదొడ్లు





నిర్వహణ చేపడతామని ఎంపీ హామీ ఇచ్చారు. అదేవిధంగా గౌరవ ఎంపి గారి సూచనలతో వెటర్నరీ క్లినిక్ కి కావాల్సిన మౌలిక సదుపాయాలు, త్రాగునీరు వంటి సౌకర్యాలు చేపడతామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు సూరజ్ కుమార్ పట్నాయక్, చీఫ్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ పి కైలాష్ కాంత్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె రామారావు, శ్రీనివాస్ కుమార్ నోరి శాంతి, సెంట్రల్ ఉమెన్స్ వింగ్ ట్రెజరర్ జి.శాంతి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి పి.శ్రీలత, వికలాంగుల పునరావాస కేంద్ర ప్రతినిధి రమేష్ బిక్షపమ్మ, జ్ఞానేశ్వరి, సుగుణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఉద్యోగుల సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ

*** జీవో నంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలి,ఆర్టిజన్, కార్మికుల డిమాండ్లపై ఆందోళన**


మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిసన్, అన్మ్యాన్డ్, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మహబూబాబాద్ ఎస్సీ కరెంట్ ఆఫీస్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగతుండగా పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వ హయంలో విద్యుత్ కార్మికులకు జీవో నెం 11 తీసుకొచ్చి ఆర్టిజన్లుగా గుర్తించి రెగ్యులర్ జీతాలు ఇచ్చి వారి కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉన్నాడు కేసీఆర్.కాంట్రాక్టు వ్యవస్థను తొలగించి విద్యుత్ కార్మికుల పాలిట దేవుడు అయ్యాడు కేసీఆర్. గత ప్రభుత్వ హయంలోనే విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించారు.




మీ సహకారంతో రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇచ్చి రైతులను రాజు చేసిండు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు దృష్టికి మీ సమస్యలను తీసుకెళ్లి ప్రభుత్వంపైన ఒత్తిడి తెచ్చే విధంగా కోట్లాడుతామన్నారు. కార్మికులు తమ ప్రధాన డిమాండ్లుగా విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్, ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్ అమలు, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్లో అన్మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిసన్లుగా విలీనం చేయాలని కోరారు. అలాగే 2016కు ముందు అర్హతలు కలిగి పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిసన్లుగా గుర్తించాలని, పీస్ రేట్ కార్మికులకు జీవో నంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కార్మికుల పట్ల కపట ప్రేమ చూపించి పర్మినెంట్ చేస్తామని రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క లు చెప్పిన మాటలు నిలబెట్టుకోని కేసీఆర్ హయం లో తెచ్చిన జీవో నెం 11 ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 24000 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో ఎన్నో ఏండ్లుగా పని చేస్తున్నారు వారిని పర్మినెంట్ చేయాలి. సరియైన జీతం లేక చాలి చాలని 15000/ ,16000/ జీతాలతో కుటుంబాలు గడవక ఇప్పటి వరకు 200 మంది కార్మికులు చనిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

## చచ్చినా.. బతికినా.. భాజపాతోనే ఉంటా: బండి సంజయ్

హైదరాబాద్: ''వలసపోవడానికి నేను అవకాశవాదిని కాదు. చచ్చినా.. బతికినా భాజపాతోనే ఉంటా'' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆయన ఈమేరకు స్పందించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును వ్యతిరేకించే



మీరు భాజపాను విమర్శిస్తారా? అని ప్రశ్నించారు. ''దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్.. మహిళా రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయలేదు? కనీసం కాంగ్రెస్ పార్టీలోనైనా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశారా? క్యాబినెట్‌లో ఎంతమంది మహిళలకు అవకాశం ఇచ్చారు?'' అని నిలదీశారు.

## అంబేద్కర్ చరిత్ర పుస్తకాల పంపిణీ



ప్రజాస్ఫూర్తి , జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ అంబేద్కర్ పూలే మహాజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చరిత్ర పుస్తకాలను పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఆ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు మునేసుల శైలేందర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులకు,యువకులకు అంబేద్కర్ చరిత్ర పై అవగాహన కల్పించడానికి ఆయన సేవలను తెలియజేయడానికి పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక మహోన్నత వ్యక్తిపై పూర్తి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు రమేష్ పాఠశాల కరస్పాండెంట్ సతీష్ గౌడ్ ఇన్చార్జీలు తిరుపతి, మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫలితాల శాతం మరింత పెంచాలి

*** ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యాపకులకు సూచన**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఫలితాల సంగతి విద్యార్థులు.. అధ్యాపకులు చూసుకోండి.. కళాశాల ప్రగతి నాకు వదిలేయండి.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేను దగ్గరుండి చూసుకుంటా.. నాకు కావలసినవి మంచి ఫలితాలు.. ప్రస్తుత ఫలితాల శాతం సరిపోదు.. మరింత పెంచండి.. సమస్యలు ఉంటే నాకు చెప్పండి.. అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనంలో ఇంటర్మీడియట్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల నిర్మాణం పూర్తయితే ఇక్కడ అవసరమైన సిబ్బందిని కూడా పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసి, సదుపాయాలు కల్పించి విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యాపకులు ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని అన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఇలాంటి తరగతి గదిలోనే కూర్చొని అబ్దుల్ కలాం లాంటి వాళ్ళు ఉన్నత స్థాయికి ఎదిగారని, మీకు కూడా ఆ శక్తి, అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల నిర్మాణం గురించి తనతో చెప్పినప్పుడు ఓ కోటి రూపాయలు మంజూరు చేసి మరమ్మత్తులు చేయించి మమ అంటే సరిపోయేదని, కానీ ఒక గ్రామీణ విద్యార్థిగా గ్రామీణ విద్యార్థుల సమస్యలు తెలుసుకో కాబట్టి వారికి పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని ఉద్దేశంతోనే ఈ కళాశాల నిర్మాణం చేపట్టడం జరిగిందని వివరించారు.. పాత్రికేయులు సమస్యలు దృష్టికి తెలిసినప్పుడు వాటిని అర్థం చేసుకొని మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని హితువు పలికారు. విద్యార్థులను శాలువాలతో సత్కరించి స్వీట్లు తినిపించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, చెంది తిరుపతిరెడ్డి, బాలరాజ్ గౌడ్, పురుషోత్తం రెడ్డి, ఎర్రోళ్ల అశోక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా టీఎస్ యుటిఎఫ్ 13వ ఆవిర్భావ దినోత్సవం




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ ఎంఆర్సీ భవనంలో టీఎస్ యుటిఎఫ్ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కృష్ణయ్య సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి మనోహర్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల హక్కుల కోసం యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని కొనియాడారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో బాధ్యతాయుతంగా పనిచేయడమే కాకుండా, సామాజిక స్పృహతో అనేక సామాజిక అంశాలపై పోరాడే గొప్ప చరిత్ర ఈ సంఘానికి ఉందని ఆయన తెలిపారు. సీనియర్ నాయకులు పి. వెంకట రమణ, బి.నర్సింలు మాట్లాడుతూ... సంఘంతో తమకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకల్లో జిల్లా కార్యదర్శులు కె. వెంకటయ్య, జి. శివారెడ్డి, నాయిని నర్సిములు, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవమ్మ, బిజిలి సత్యం, షాబాద్ మండల అధ్యక్షులు పి. శేఖర్ గౌడ్, కేశంపేట్ మండల ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ,ఎఫ్.డబ్ల్యూ.ఎఫ్ స్టేట్ కౌన్సిలర్ ఎల్. బాలయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వలిగి కృష్ణ, ఎల్. రాములు, మహేష్, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరు పాటించాలి: సీఐ ప్రతాప్

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం చేయాలని కొత్తగూడెం టూ టౌన్ సీఐ డి.ప్రతాప్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లోని రామవరం మార్కెట్ ఏరియాలో కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించారు. వార్డు సభకు హాజరైన వారితో సిఐ ప్రతాప్ రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,



సీటుబెల్ట్ ధరించాలని, వాహనానికి సంబంధించి అన్ని రకాల ధృవీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని, అలా ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. 15వ డివిజన్ గుండా విజయవాడ - భద్రాచలం జాతీయ రహదారి వెళ్తుండటం, రామవరం ప్రధాన సెంటర్‌లో రోడ్డు ఇరుకుగా ఉండటం, భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నందున పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలో పెద్ద ఎత్తున రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ సుప్రియ మాట్లాడుతూ పోలీసు అధికారులకు ప్రజలు, వాహనదారులు సహకరిస్తూ రోడ్డు భద్రతకు, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాంత్, ఆకునూరి కనకరాజు, హరిసింగ్, మోయినుద్దీన్, నజీర్, మద్దికుంట గణేష్, జాకీర్, ప్రకృతి హరితదీక్షకురాలు నైనిక రజువా, వర్తక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ ఫలాలను పరిరక్షించుకోవాలి




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: స్వతంత్ర భారతావాణికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో ఎందరో పెద్దలు అందించిన రాజ్యాంగ ఫలాలను రక్షించుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ న్యాయ సహాయన్యాయవాది పిలుపునిచ్చారు. మహబూబాబాద్ బాలల సంరక్షణాలయంలో రాజ్యాంగ హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. భారతదేశంలో తయారయ్యే ప్రతి చట్టము రాజ్యాంగానికి అనుగుణంగా ఉండవలసిందేనని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి రాజ్ కృష్ణ తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తమ హక్కుల కోసం పోరాడటం తో పాటు తమ విధులను కూడా సక్రమంగా నిర్వహించాలని అన్నారు. సంక్షేమ రాజ్యమైన భారత దేశంలో సాంఘిక ఆర్థిక ఇతర వివక్షతలకు గురి అయిన వారికి న్యాయ సేవాధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. ఉచిత న్యాయ సహాయానికై టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను వినియోగించుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో శరణాలయ ఇన్చార్జ్ లోకేష్ పాల్గొన్నారు.

## భారత రత్న బాబా సాహెబ్ డా: బి. ఆర్. అంబేడ్కర్ జయంతి ఉత్సవ వేడుకలు



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: కమిషనర్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ హైదరాబాద్, జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ ఆదేశానుసారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా మహబూబాబాద్ జిల్లాలో జరుపుటకు నిర్ణయించినారు. మంగళవారం ఉ :: 9 గంటలకు స్థలం జిల్లా కోర్టు ఎదురుగా మహబూబాబాద్ నందు బాబా సాహెబ్ డా: బి ర్ అంబేడ్కర్ విగ్రహమునకు పుష్పమాలంకరణ జరుగునని ఉత్సవ సభావేదిక మీటింగ్ హాల్ జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ కార్యాలయం నందు సమావేశము నిర్వహించబడునని అన్నారు.కావున అన్ని కుల సంఘములు, ఉద్యోగులు, అధికారులు, దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల, మైనారిటీ, ఇతర నాయకులకు ప్రత్యేక ఆహ్వానము.కావున ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని భారత రత్న, బాబా సాహెబ్ డా: బి. ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయగలరని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి .శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## మండలాల ప్రత్యేక అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించాలి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ చంద్రశేఖర్ తన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా రబి ధాన్యం సేకరణ పై మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అన్ని మండలాల్లో అధికారులు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్ చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని, ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టే ఎవరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.హాస్టల్ల తనిఖీలలో భాగంగా ఎం ఎస్ ఓ లు ఆర్‌సీవోలు, ప్రిన్సిపాళ్ల ఆయా విభాగాల నుండి నివేదికలను త్వరగా సమర్పించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న కుక్కల సంఖ్యపై సమాచారం సేకరించాలని ,ఫీమేల్, మేల్ కుక్కల వివరాలను ప్రత్యేక ఫార్మాట్‌లో సేకరించి పంపాలని, గ్రామపంచాయతీ ద్వారా డిపివో, మున్సిపల్ కమిషనర్లకు పంపించాలని సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈనెల 13 నుండి 18 వరకు నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఏప్రిల్ 15 నుంచి కలెక్టరేట్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించి కార్యాలయానికి రావాలని ఆదేశించారు. హెల్మెట్ లేకుండా వచ్చిన వారికి కార్యాలయంలో ప్రవేశం ఉండదని తెలిపారు. కార్లలో వచ్చే వారు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని ఆదేశించారు.జిల్లాలోని ప్రైవేట్ మరియు ప్రభుత్వ పాఠశాలల వద్ద రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల ముందు జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ కూడళ్ల వద్ద జీబ్రా లైన్లు, ట్రాఫిక్ నిబంధనల సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు.ముఖ్యంగా ప్రమాదాలు జరిగే క్రిటికల్ పాయింట్ల వద్ద లైనింగ్ పనులు 3 నుంచి 4 రోజుల్లో పూర్తి చేయాలనిఆదేశించారు. జిల్లాలో 8 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అక్కడ వార్నింగ్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఈ పనిని ఒక నెలలో పూర్తి చేయాలని సూచించారు.రోడ్డు భద్రతపై గ్రామ స్థాయిలో అవగాహనపెంపొందించేందుకు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని, వార్డ్ ఆఫీసర్ల ద్వారా వార్డ్ కమిటీలు ఏర్పాటు చేసి వాటి జాబితాను మున్సిపల్ కమిషనర్ కుగ్రామపంచాయతీ రోడ్ సేఫ్టీ కమిటీ డీపీఓ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు.ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 71 ఇతర శాఖలకు 55 ఫిర్యాదులు వచ్చాయి.ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.

## టీజీఎస్ ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్




హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. మార్చి 13న సమ్మె నోటీసులు ఇచ్చామని.. ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ప్రభుత్వం సమ్మె నివారణ చర్యలు చేపట్టాలని కోరింది. ప్రభుత్వం, యాజమాన్యం ముందు 32 డిమాండ్లు పెట్టినట్లు జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

*** జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమావారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులతో కలిసి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా మరిపెడ మండలం, లునావత్ తండా కు చెందిన లునావత్ సురేష్ తనకు సాంకేతిక కారణాలతో ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని అధికారులు పరిశీలించి రుణమాఫీ చేయగలరని కోరారు.జిల్లా కలెక్టరేట్ లోని గార్డెన్ లో తోటమాలిగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తాము కొత్తగా జిల్లా ఏర్పాటైన దగ్గరి నుండి తోటమాలి పని చేసుకుంటూ జీవనాధారం చేసుకుంటున్నామని, కాంట్రాక్టర్ ద్వారా మాకు బిల్లులు రావట్లేవని తమను మునిసిపాలిటీలో చేర్పించి ఉపాధి కల్పించాలని కోరారు. ఇనుగుర్తి మండలం రెండు పడక గదుల నిర్మాణ లబ్ధిదారులు తమ గ్రామానికి మంజూరి అయిన రెండు పడక గదుల నిర్మాణానికి సంబందించిన బిల్లులు ఇప్పించగలరని కోరారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (171) దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## బాధ్యతాయుతంగా ట్రాఫిక్ రూల్స్ జిబ్రా క్రాసింగ్ పాటించాలి

*** జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: బాధ్యతాయుతంగా ట్రాఫిక్ రూల్స్ జిబ్రా క్రాసింగ్ పాటించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ అర్రైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పాల్గొనాలని, అన్ని విభాగాల సిబ్బంది, టూ వీలర్ వాళ్ళు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, వాహనం నడపరాదని, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, అతివేగంగా వాహనాలు నడపరాదనీ, ఓవర్టేక్ చేయరాదని తెలిపారు, 13, వతేదీన రోడ్ సేఫ్టీ, రవాణా భద్రత వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాల ప్రారంభం రోడ్ సేఫ్టీ మెటీరియల్ పంపిణీ, ముఖ్య కుడళ్ళు, హైవేలపై బ్యానర్ల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 14, తేదీ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహాల వద్ద రోడ్డు సేఫ్టీ ప్రతిజ్ఞ కార్యక్రమం, 15, హెల్మెట్ల వాడకం పై అవగాహన, ముఖ్య జంక్షన్ లలో హెల్మెట్ల ధరించి బైక్ ల ర్యాలీ ల నిర్వహణ,16వ తేదీన సీట్ బెల్ట్ ధరించడం పై అవగాహన కార్యక్రమం , 17వ తేదీన ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో వాహనాల తనిఖీలు నిర్వహించి హై స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్ వయోలేషన్స్ పై సంయుక్తంగా నిర్వహించి అవగాహన చేయుట,18 వ తేదీ న ఆరోగ్య శిబిరాల ఎర్పాటు మరియు కార్యక్రమ ముగింపు వేడుకలు విద్యాసంస్థలు ప్రభుత్వ కార్యాలయాలు బహిరంగ ప్రదేశాలలో ఆర్టీసీ బస్టాండ్లు రైల్వే స్టేషన్లు ఆటో, టాక్సీ జనసాంద్రత అధికంగా ఉండే ప్రదేశాలను ట్రాఫిక్ రూల్స్ ఈ కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే తమకే మంచిదని ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా ఉండవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే ట్రాఫిక్ రూల్స్ హెల్మెట్, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, పాల్గొన్నారు.

## భట్రాజులు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలి

*** ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతారామరాజు పిలుపు.**




కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రంలోని భట్రాజు కులస్తులు అన్ని రంగాలలో చైతన్యవంతులు కావాలని ఆ దిశగా ముందడుగు వేద్దామని ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామ రాజు పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా (పడమర)శాఖ సర్వసభ్య సమావేశం ఎన్నికలు నియోజకవర్గ పరిధి సూరారం లోని కృషి హై స్కూల్ లో జిల్లా అధ్యక్షుడు కూరపాటి కరుణాకర్ రాజు అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన తోపాటు ఎన్నికల అధికారిగా వ్యాసభట్టు బాలరాజు,పరిశీలకులు గా ఇండివర్ రాజు,దశరథ దురేందర్ రాజు లు వ్యవహరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిత విద్వాంసులుగా పేరున్న తమ కులస్తులపై కొంతమంది అజ్ఞానులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని రాష్ట్రవ్యాప్తంగా కులస్తులందరూ ఏకమై న్యాయం జరిగే వరకు పోరాడుదామని వ్యాఖ్యానించారు.సామాజిక రాజకీయ రంగాలలో ప్రత్యేక స్థానం సంపాదించి భవిష్యత్తులో భట్రాజుల సత్తా చాటుదామని ధైర్యం చెప్పారు...భట్రాజు సంఘ భలోపేతానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని పేర్కొన్నారు.భట్రాజు అంటే సమాజంలో ఒక బాధ్యత గల పౌరుడిగా ఎదగాలన్నారు..నూతనంగా ఎన్నికైన మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించి అభినందించారు. వరుసగా మూడో సారి జిల్లా అధ్యక్షులు గా నియమితులైన కూరపాటి కరుణాకర్ రాజు మాట్లాడుతూ భట్రాజు ఫెడరేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి వ్యక్తిగత రుణాలివ్వాలని, పాలకమండలి ఏర్పాటు చేయాలని,తమ కులస్తులు పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై శిక్షించే విధంగా బీసీ అట్రాసిటీ చట్టం రాష్ట్ర తేవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.త్వరలోనే మహిళా విభాగాన్ని ఎన్నుకొనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సాహితి కార్యదర్శి చక్రాల రేవతినంద్ భట్ ,మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గం :** అధ్యక్షులుగా కూరపాటి కరుణాకర్ రాజు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా కాంచనపల్లి శ్రీకాంత్ రాజు, ప్రధాన కార్యదర్శిగా లోలబట్టు కృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా తంగెళ్ల రాధాకృష్ణభట్,వి.వి.రాఘవరాజు, కేశిపెద్ది వెంకటేశ్వరరాజు, వేమరాజు శేషం రాజు, బాహటం కృష్ణార్జునరాజు, సంయుక్త కార్యదర్శులుగా కూరపాటి శ్రీరామరాజు(రాజు శ్రీరామ్),మొగసాటి సుధీర్ కుమార్ రాజు, వీణా వీరంరాజు, పైడికొండల జనార్దన్ రాజు, కోశాధికారిగా చక్రహరి శ్రీనివాసరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి గా పోరంకి శ్యాంప్రసాద్ రాజు,ప్రచార కార్యదర్శులుగా సరస్వతి నరేందర్ రాజు,బట్టు ప్రవీణ్ రాజు,క్రీడా కార్యదర్శిగా ఉదయభాను రామకృష్ణ రాజు ,సాంస్కృతిక కార్యదర్శి గా ఉడుమూడి మధువర్మ,తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఉడుమూడి సత్యవాణి,మరి కొందరు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు ధ్రువీకరించారు.

## డీలిమిటేషన్‌పై రేవంత్‌రెడ్డికి అవగాహన లేదు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్:డీలిమిటేషన్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదన్నారు. తాము కూడా దక్షిణాదిలోనే ఉన్నామని, అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. ‘‘2011 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ జరుగుతుంది. ఈ ప్రక్రియకు రెండేళ్ల సమయం పడుతుంది. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయొద్దని కాంగ్రెస్‌ను కోరుతున్నా. ఈ మొత్తం వ్యవహారాన్ని రేవంత్‌రెడ్డికే వదిలేస్తున్నా’’ అని కిషన్‌రెడ్డి అన్నారు.

## పతంజలి యోగ సెంటర్లో ఫ్రీ హెల్త్ క్యాంప్



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : మున్సిపాలిటీ లో 23, 24, 25 వార్డులకు సంబంధించి 24వ వార్డులోని పతంజలి యోగ సెంటర్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు ఆధ్వర్యంలో ఎం.ఎల్.హెచ్.పి వైద్యాధికారి డాక్టర్ సాదిక్ అహ్మద్, డాక్టర్ ప్రవీణ వార్డు ప్రజలకు ఫ్రీ హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, 24వ వార్డు కౌన్సిలర్ అగ్గనూరు విశాల విశ్వం, 25వ వార్డు కౌన్సిలర్ పెంటయ్య తదితరులు పాల్గొనగా 23వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్యాంపులో మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బసవేశ్వర్ మాట్లాడుతూ మన తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మెడికల్ క్యాంపును 23,24,25 వార్డుల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ అందరికీ బిపి పరీక్షలు, షుగర్ పరీక్షలు ఫ్రీగా చేసి, వచ్చిన వారందరికీ కావలసిన యొక్క మందులు ఫ్రీ అందిస్తారని తెలియజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలందరూ కూడా ఆరోగ్యానికి కాపాడుకోవాలని ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యం ఉంటేనే అన్ని పనులు చేసుకోవచ్చని తెలియజేస్తూ, ప్రజలందరూ కూడా ప్రతిరోజు వ్యాయామాలు చేస్తూ, మంచి ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, మంచి ఆహారం భుజించాలని చెప్పారు. హెల్త్ క్యాంపు దగ్గరికి వచ్చిన వారందరికీ ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్లు పెంటయ్య , డాక్టర్ సాదిక్ అహ్మద్ , ప్రవీణ, జె.శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్, సూపర్వైజర్ చంద్రకళ, ఏఎన్ఎం లు భారతి, సుకేల, రాజా వరప్రసాద్, జైహింద్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అగ్గనూరు నందు, అగ్గనూరు కిట్టు, మోగి సిద్దు, మల్లిపెద్ది సాయి లతో పాటు పలువురు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


## ఇంటర్మీడియట్లో ప్రభంజనం సృష్టించిన

*** చైతన్య విద్యా నికేతన్ పాఠశాల పూర్వ విద్యార్థులు**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఆదివారం వెలువడిన ఇంటర్ ఫలితాలలో చైతన్య విద్యా నికేతన్ పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని చైతన్య విద్యానికేతన్ పాఠశాల ఛైర్మెన్ డా.శివరాత్రి యాదగిరి అన్నారు. ఇంటర్ ఫలితాలలో చైతన్య విద్యా నికేతన్ పాఠశాల పూర్వ విద్యార్థులు శ్వేత కుమారి (496/500),రిషిత (464/470) రాష్ట్ర స్థాయిలో స్టేట్ మొదటి ర్యాంక్ సాదించి, పాఠశాలకి, కళాశాలకి, తల్లిదండ్రులకి గౌరవాన్ని దక్కించారు. గతంలో పాఠశాల స్థాయిలో మా ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతో ఈ విజయం సాధించామని మరిన్ని విజయాలు సాధిస్తామని విద్యార్థులు ఆత్మవిశ్వాసం ప్రకటించారు.అత్యధిక మార్కులు (496/500) సాధించిన వి. రిషిత చైతన్య విద్యానికేతన్ పాఠశాల ఛైర్మెన్ డా॥శివరాత్రి యాదగిరి , డైరెక్టర్ మంగదేవి , ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా సత్కరించి అభినందించారు మున్నుముందు మంచి ర్యాంకులతో భవిష్యత్తు బాగుండాలని ఆశీర్వాదించారు.

## కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసు



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు జారీ చేశారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు అంశంపై బీఆర్ఎస్ సోషల్ మీడియాలో నిరాధర ఆరోపణలు చేశారని అందులో పేర్కొన్నారు. తన ప్రతిష్ఠను దెబ్బతీశారని చెప్పారు. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ దుష్ప్రచారానికి కేసీఆర్‌దే బాధ్యత అని పేర్కొన్నారు. 48 గంటల్లో పోస్టులు తొలగించి ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల



హైదరాబాద్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (TG TET 2026) కు నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 15 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా.ఈ.నవీన్ నికోలస్ వెల్లడించారు. ఏడాదికి రెండు సార్లు (జూన్, డిసెంబర్) టెట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాదిలో ఇది తొలి విడత నోటిఫికేషన్ కానుంది. టెట్ నిర్వహణకు సంబంధించి ఇటీవలే పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపగా.. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అనుమతించడంతో తాజాగా నోటిఫికేషన్ (Telangana TET notification) విడుదల చేశారు.

**ముఖ్య తేదీలు**

ఏప్రిల్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
జూన్ 9 నుంచి టెట్ హాల్ టికెట్ల డౌన్‌లోడ్
జూన్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ
జులై 28 నుంచి 31 మధ్య ఫలితాలు

తాజా నోటిఫికేషన్ ప్రకారం.. టెట్ ఆన్‌లైన్ పరీక్షలు జూన్ 15 నుంచి 30వ తేదీ మధ్య ఉదయం 9 నుంచి 11.30 వరకు; అలాగే, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు జరుగుతాయి. ఏప్రిల్ 15 నుంచి జులై 31 వరకు అన్ని పని దినాల్లో హెల్ప్ డెస్క్ సర్వీసులు అందిస్తుందని అధికారులు తెలిపారు. టెట్ పరీక్షకు దరఖాస్తు రుసుం జనరల్, బీసీ అభ్యర్థులకు ఒక్కో పేపర్ (పేపర్ 1, పేపర్ 2)కి రూ.750 కాగా.. రెండు పేపర్లూ రాయాలనుకుంటే రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులైతే ఒక్కో పేపర్‌కు రూ.700, రెండు పేపర్లకు అయితే రూ.950 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

## విషాహారం తిని నాలుగేళ్ల బాలుడి మృతి

ములుగు: గోవిందరావుపేట ఎన్టీఆర్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. విషాహారం తిని నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. కోతుల బెడద తప్పించుకోవడానికి పెట్టిన విషాహారం తిని చనిపోయాడు. వివరాల్లోకి వెళితే.. కాలనీకి చెందిన బాలుడు అశ్విన్ నందన్.. అక్క, స్నేహితులతో కలిసి అంగన్వాడీ కేంద్రం పక్కనే ఉన్న పల్లె ప్రకృతి వనానికి వెళ్లాడు. అక్కడ వారికి ఒక ప్యాకెట్ కనిపించగా.. తీసుకొని తలా కొద్దిగా నోట్లో వేసుకున్నారు. అశ్విన్ వెంట వచ్చిన ఇద్దరు అది చేదుగా ఉండడంతో వెంటనే ఉమ్మి వేశారు. ఈలోగా అశ్విన్ తన నోట్లో వేసుకున్న దానిని మింగేశాడు. మరికొంత తినే ప్రయత్నం చేయగా అక్క వారించింది.

# న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు

* **న్యాయవ్యవస్థ బలోపేతానికి కృషి చేస్త**
* **జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో న్యాయమూర్తిగా వివిధ హోదాలలో పనిచేసేందుకు లభించిన అవకాశం అమూల్యమైనదని నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. సోమవారం నల్లగొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా, మరియు నల్లగొండ జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి జి.సంపూర్ణ ఆనంద్ రంగారెడ్డి జిల్లా కోర్టుకు చైర్మన్, ల్యాండ్ రిఫార్మ్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌గా, అలాగే రెండవ అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి కోర్టు మరియు అదనపు సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలకడం జరిగింది. బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులను శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వివిధ హోదాలలో న్యాయమూర్తిగా సుదీర్ఘకాలం పనిచేసి వృత్తిరీత్యా బదిలీపై వెళ్లడం అనేది సహజమైన ప్రక్రియలో భాగమైనప్పటికీ, బదిలీపై వెళ్తున్న సందర్భంలో న్యాయవాదులు బాధను వ్యక్తం చేయడం మేము కూడా సహజంగా బాధపడే విషయం అన్నారు.



ఉమ్మడి నల్లగొండ జిల్లా న్యాయవాదులతో ఉన్న అనుబంధం మర్చిపోలేనిది అన్నారు. ఈ జిల్లా న్యాయవాదులను చూసి నేను చాలా నేర్చుకోవడం జరిగిందన్నారు. ఈ జిల్లాతో కుటుంబ సభ్యుల మధ్య ఉన్న బాంధవ్యం లాగా నాకు అనుబంధం ఉందన్నారు. న్యాయవాదులు ఆశించిన విధంగానే ఎక్కడ పని చేసినా సత్వర న్యాయం అందే విధంగా కృషి చేస్తానన్నారు. మానవతా దృక్పథం ఉన్నచోట న్యాయం,ధర్మం నిలబడుతుందన్నారు. న్యాయం,ధర్మం పట్ల అంకితభావంతో ప్రతి ఒక్కరం పనిచేయాలన్నారు. ఉన్నతాధికారుల మరియు న్యాయవాదుల సహకారంతో నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతన బిల్డింగ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ తీసుక రావడంలో శక్తి వంచన లేకుండా పని చేశానన్నారు.లోక్ అదాలత్ లో కూడా నల్లగొండ జిల్లాకు మంచి స్థానం రావడంలో అధికారులు న్యాయవాదులు అందించిన సహకారం ప్రశంసనీయమన్నారు. ఎక్కడ పనిచేసినా న్యాయ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జీ సంపూర్ణ ఆనంద్ మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ రిలేషన్స్ కొనసాగించడంలో న్యాయవాదులు అందించిన సహకారంతోనే ఇక్కడ సుదీర్ఘకాలం పని చేయగలిగామని వారు అన్నారు. న్యాయాన్ని,ధర్మాన్ని కాపాడడంలో ఎవరి వంతుగా వాళ్లు పనిచేసినప్పుడే న్యాయవ్యవస్థ పై నమ్మకం ఏర్పడుతున్నారు. సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ జిల్లా న్యాయవ్యవస్థ అభివృద్ధికి ఇద్దరు న్యాయమూర్తులు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం న్యాయవాదులు శాలువాలతో పూల బొకేలతో బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బచ్చనబోయిన అశోక్ కుమార్,సీనియర్ న్యాయవాదులు రామచందర్ రావు,మునగాల నారాయణరావు,నూకల నరసింహారెడ్డి,అమరేందర్ రెడ్డి, జి.జవహర్ లాల్, మేడ మోహన్ రెడ్డి, మరియు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పజ్జూరి స్వామి గౌడ్,నూకల సంధ్యారాణి, సహాయ కార్యదర్శి సూరేపల్లి అమరావతి, కోశాధికారి ఎండి ఫిరోజ్, గేమ్స్ సెక్రటరీ నారబోయిన ప్రసన్నకుమార్, సభ్యులు గుర్రం వెంకట్ రెడ్డి, పులిజాల కార్తీక్, రామకృష్ణ, సుమశ్రీ, నాంపల్లి భాగ్యమ్మ, పందుల సైదులు, దువ్వ గీత, ఎం.ప్రగతి, కే ఎన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీడీపీఓ ఉదయ

ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : షాద్‌నగర్ పరిధిలోని సాయిబాబా కాలనీలో గల 3వ, నెంబర్ అంగన్వాడీ కేంద్రాన్ని సీడీపీఓ ఉదయ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పలు అంశాలను సవివరంగా పరిశీలిస్తూ, పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీలో భాగంగా కేంద్రంలో అమలవుతున్న కమిటీ వ్యవస్థ గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అక్కడి చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను స్వయంగా పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి




చెక్ చేశారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. కేంద్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ ప్రసన్న విధులకు సమయానికి హాజరు కావాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గట్టిగా హెచ్చరించారు. పిల్లలకు అందిస్తున్న ఆహారం నాణ్యతపై కూడా ఆమె విచారణ జరిపారు. గుడ్లు, బాలామృతం, రేషన్ సరఫరా సక్రమంగా జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకుని, సరైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల విషయమై కూడా ఆమె పరిశీలన జరిపి, కేంద్రంలో అవసరమైన సదుపాయాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సూచించారు. సరఫరా అవుతున్న ఆహార పదార్థాల నాణ్యత, సరఫరా సంస్థల వివరాలపై కూడా సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉదయ మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ఎటువంటి నిర్లక్ష్యం సహించబోనని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల భవిష్యత్తుకు పునాది వంటివని, అందువల్ల సిబ్బంది తమ విధులను కచ్చితంగా నిర్వర్తించాలని సూచించారు. స్థానికులు సీడీపీఓ ఆకస్మిక తనిఖీపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి తనిఖీలు తరచుగా నిర్వహిస్తే కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు.



## రాజమండ్రి జైలుకు.. ఉగ్రలింకుల కేసు నిందితులు

విజయవాడ: ఉగ్రలింకుల కేసులో అరెస్టయిన నిందితుల కస్టడీ ముగిసింది. ఐదు రోజులపాటు నిందితులను కస్టడీకి తీసుకొని పోలీసులు ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో ఉగ్రవాద భావజాల వ్యాప్తిపై వివిధ కోణాల్లో ప్రశ్నించారు. బెన్‌ఎక్స్.కామ్, దేశవ్యాప్త ఉగ్ర నెట్‌వర్క్ విస్తరణ యత్నాలపై ప్రశ్నలు సంధించారు. కస్టడీ అనంతరం ఆరుగురు నిందితులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా.. ఈ నెల 20 వరకు రిమాండ్ విధించింది. దీంతో నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

# రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం: బండి సంజయ్



నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి వాదనను రాజ్యాంగ విరుద్ధమని కొట్టిపారేశారు. "అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్నది రేవంత్ రెడ్డి వాదన. అదే నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లూ ఇవ్వాలా? వెనుకబడిన పాలమూరు, ఆదిలాబాద్ వంటి జిల్లాల పరిస్థితి ఏమిటి?" అని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నిధులు పంపి, ఇప్పుడు డబ్బు చుట్టూనే సిద్ధాంతాలు అల్లుతున్నారా? అని ఎద్దేవా చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను కించపరిచేలా ముఖ్యమంత్రి మాట్లాడటం బాధాకరమని, అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుంచి బహిష్కరించేవారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు. గత 50 ఏళ్లలో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన ఆయన, గతంలో పార్లమెంట్‌లో బిల్లు కాపీలు చించివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకోవడంపై నిలదీశారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, ఇది అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ విభజన రాజకీయాలకు నిదర్శనమని, ఇప్పటికైనా రాజ్యాంగ విలువలపై గౌరవంతో మాట్లాడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.



# తితిదేకు రూ.1.01 కోట్ల విరాళం

తిరుమల: తితిదేకు ఓ సంస్థ భారీ విరాళాన్ని అందించింది. హైదరాబాద్‌కు చెందిన వర్మ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు సోమవారం రూ.1,01,01,116 విరాళంగా అందించారు. తితిదే శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు ఈ మొత్తాన్ని అందించారు.

# తండ్రికి ఘన నివాళులు...మంత్రి శ్రీధర్ బాబు భావోద్వేగ ట్వీట్

- **తండ్రి, మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు నివాళి**
- **సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ సందేశం పోస్ట్ చేసిన శ్రీధర్ బాబు**
- **ఆఖరి శ్వాస వరకు మంథని ప్రజల కోసమే పనిచేస్తానని ప్రతిజ్ఞ**
- **1999లో ఇదే రోజున నక్సలైట్ల చేతిలో శ్రీపాదరావు హత్యకు గురైన వైనం**



హైదరాబాద్, ఏప్రిల్ 13 : తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తన తండ్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దివంగత డి. శ్రీపాదరావు వర్ధంతి (ఏప్రిల్ 13) సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఫొటోలను పంచుకుని, తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి నేర్పిన విలువలనే మార్గదర్శకాలుగా ప్రజా సేవలో ముందుకు సాగుతానని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తన సందేశాన్ని పంచుకున్నారు. "నాన్నా... మీరు నేర్పిన సంస్కారం, అందించిన విలువలు, చూపిన బాట... ప్రజా సేవలో నన్ను నిత్యం ముందుకు నడిపించే వెలుగు దివ్వెలు. మీ అడుగుజాడలే నా ధైర్యం.. మీ ఆశీస్సులే నా బలం. మీ వారసత్వాన్ని గుండెల్లో మోస్తూ... మీ ఆశయాలే మార్గదర్శకంగా... మీ బిడ్డగా నా ఆఖరి శ్వాస వరకు 'మంథని' ప్రజల కోసమే పని చేస్తా. మీ స్ఫూర్తితో మొదలైన నా ఈ సేవా యజ్ఞం ఆగదు.. ప్రజల పట్ల నాకున్న ఈ సంకల్పం సడలదు. మీ అడుగుజాడల్లో నా ఈ ప్రయాణం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది" అని పేర్కొన్నారు. కాగా, శ్రీపాదరావు 1999 ఏప్రిల్ 13న కరీంనగర్ జిల్లాలో నక్సలైట్ల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. ఆయన మరణానంతరం శ్రీధర్ బాబు రాజకీయాల్లోకి ప్రవేశించి, మంథని నియోజకవర్గం నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

'దోస్త్' నోటిఫికేషన్ విడుదల..

# మూడు విడతల షెడ్యూల్ ఇదే

హైదరాబాద్: రాష్ట్రంలోని 2026 27 విద్యా సంవత్సరంలో అన్ని డిగ్రీ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(DOST) నోటిఫికేషన్ విడుదలైంది. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. మొత్తం మూడు విడతల్లో చేపట్టే ఈ ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 15 నుంచి మొదలు కానుంది. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్న విషయం తెలిసిందే. జూన్ నెలాఖరు నాటికి మొత్తం ప్రక్రియను పూర్తి చేసి జులై 1 నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. ఈ అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన పూర్తి అప్‌డేట్స్ కోసం దోస్త్ అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు.

**తొలి విడత**

రిజిస్ట్రేషన్‌ప్రక్రియ : ఏప్రిల్ 15 నుంచి మే 7 వరకు
రిజిస్ట్రేషన్ ఫీజు : రూ.200
వెబ్ ఆప్షన్స్: ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు
సర్టిఫికెట్ల వెరిఫికేషన్: మే 7, 8
సీట్ల కేటాయింపు: మే 14న
ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్: మే 15 నుంచి 23 వరకు

**రెండో విడత**

రిజిస్ట్రేషన్: మే 15 నుంచి మే 25 వరకు
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.400
వెబ్ ఆప్షన్స్: మే 15 నుంచి మే 26 వరకు
మే 26న సర్టిఫికెట్ల వెరిఫికేషన్
మే 30న సీట్ల కేటాయింపు
ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్: మే 31 నుంచి జూన్ 5 వరకు

**మూడో విడత**

రిజిస్ట్రేషన్: మే 31 నుంచి జూన్ 15 వరకు
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.400
వెబ్ ఆప్షన్లు: మే 31 నుంచి జూన్ 16 వరకు
సర్టిఫికెట్ల వెరిఫికేషన్: జూన్ 16
సీట్ల కేటాయింపు : జూన్ 20
ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్: జూన్ 20 నుంచి జూన్ 25 వరకు

## ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు

# కేవలం స్థానిక నాయకుల మధ్య అవగాహనే: రాంచందర్ రావు



నిర్మల్, ఏప్రిల్ 14: తెలంగాణలో పొత్తుల అంశంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కీలక ప్రకటన చేశారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించిన నేపథ్యంలో నిర్మల్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని, ఒంటరిగానే పోరాడుతుందని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య కుదిరిన అవగాహన మాత్రమేనని, పార్టీ పరంగా ఎలాంటి అధికారిక పొత్తు లేదని ఆయన వివరణ ఇచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీ పోలీసు బలంతో, గుండాయిజంతో భయభ్రాంతులకు గురిచేసినప్పటికీ, ప్రజలు బీజేపీకే పట్టం కట్టారని ఆయన కొనియాడారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ అధికార బలం పనిచేయలేదని ఎద్దేవా చేశారు. తలసరి ఆదాయం ప్రాతిపదికన అసెంబ్లీ సీట్లు పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఈ ప్రతిపాదన పేదలను, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయడమేనని విమర్శించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళల హక్కులను పట్టించుకోలేదని మండిపడ్డారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా బీజేపీ అడుగులు వేస్తోందని, వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోందని, రానున్న రోజుల్లో సొంత బలంతోనే అధికారం చేపడతామని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశ రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం లభిస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఓటు హక్కు సెంటిమెంటే కానీ..: 'సర్'పై సుప్రీం వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఏప్రిల్ 14: పశ్చిమబెంగాల్‌లో నిర్వహించిన సర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ జాబితాలో కొనసాగేహక్కు ఓటర్‌కు ఉంటుందని వ్యాఖ్యానించింది. ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ఆ ప్రక్రియను వక్రీకరించకూడదని హితవు పలికింది. అదే సమయంలో సర్ ప్రక్రియలో ఓట్లు తొలగించారంటూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు మాత్రం నిరాకరించింది. వారి పిటిషన్లు ఇప్పటికే అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నాయని వ్యాఖ్యానించింది. సరైన ప్రక్రియ లేకుండా ఎన్నికల సంఘం ఏకపక్షంగా పేర్లను తొలగిస్తోందని, ఈ తొలగింపులపై దాఖలైన పిటిషన్లను సకాలంలో విచారించడం లేదని పిటిషనర్లు ఆరోపించారు. "పిటిషనర్లు ఇప్పటికే ట్రైబ్యునళ్లను ఆశ్రయించడంతో.. ప్రస్తుత అభిప్రాయాలు అర్థంలేనివి" అని సుప్రీం వ్యాఖ్యానించింది. ఈపిటిషన్లను విచారించేందుకే కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు 19 ట్రైబ్యునళ్లు ఏర్పాటయ్యాయి. ఇప్పుడు అవి విచారించాల్సిన అప్పీళ్ల సంఖ్య 30 నుంచి 34 లక్షల వరకు ఉందని ఈసీ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఈ అప్పీళ్లను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తారా..? లేక గడువు పొడిగిస్తూనే ఉంటారా..? అని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం స్పందిస్తూ.."ఈ దేశంలో ఓటు హక్కు అనేది రాజ్యాంగపరమైనదే కాదు.. అదొక భావోద్వేగపూరితమైన అంశం కూడా. ఇది ప్రజాస్వామ్యంలో భాగం. ఒక ప్రభుత్వాన్ని ఎంచుకోవడంలో కీలకం. అలాగే కాలపరిమితి నిర్ణయించి, ట్రైబ్యునళ్లపై భారం మోపలేం. అధిక సంఖ్యలో ఓటర్లను తొలగించినా.. ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావితమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం. న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలి" అని వ్యాఖ్యానించింది. ఇక బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29న రెండు విడతల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

## సిబ్బంది నిర్వాకం.. కదులుతున్న రైలు నుంచి చెత్తపడేసి..



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: సీల్దా అజ్మేర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి చెత్త బయటకు పడేశారు. ఇదంతా చూస్తున్న ఓ యూజర్ వీడియో తీసి దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఆ దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'భారత రైల్వేశాఖ పాటిస్తున్న పరిశుభ్రత ఇదీ' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ట్రైన్‌లో చెత్తను సిబ్బందిలో ఒక వ్యక్తి మూట కట్టాడు. అనంతరం వాటిని కదులుతున్న ట్రైన్‌లో నుంచి బయటకు విసిరేశాడు. ఈ దృశ్యాలను పోస్టు చేసిన ఆ యూజర్ "వ్యవస్థలు ఉన్నాయి.. జవాబుదారీతనమే లేదు. హెచ్చరికలు కాదు, బదిలీలు కాదు, పరిష్కారాలు కావాలి" అంటూ ఆ వీడియోకి క్యాప్షన్‌ను జోడించి రైల్వేలను, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ట్యాగ్ చేశారు. ఈ వీడియో చూసిన పలువురు నెటిజన్లు 'దేశంలో రైల్వేశాఖ శుభ్రత, బాధ్యత ఏ స్థాయిలో ఉన్నాయో తెలిసిపోతున్నాయి' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ ఘటనపై రైల్వేశాఖ సీరియస్ అయ్యింది. ఈ పని చేసింది ఒప్పంద కార్మికుడు అని పేర్కొంది. అతడ్ని వెంటనే విధుల్లో నుంచి తొలగించి, కాంట్రాక్టర్‌పై కూడా జరిమానా విధించినట్టు వెల్లడించింది.

## బాంబులు..తూటాలకు ఓట్లతో సమాధానమిస్తారు: అమిత్ షా




త్వరలో జరగనున్న ఎన్నికల్లో బెంగాల్ ప్రజలు బాంబులు, తూటాలకు ఓట్లతో జవాబు ఇస్తారని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మమత ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని.. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది భాజపానేనని అన్నారు. పోలింగ్ రోజు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా టీఎంసీ గూండాలు తమ ఇళ్లలోనే ఉండాలని.. లేదంటే ఫలితం వెలువడిన అనంతరం వారిని కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరించారు. బెంగాల్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో నక్సలిజాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిగా అణచివేసిందని.. ఇప్పుడు చొరబాటుదారులను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని అమిత్‌షా అన్నారు. బెంగాల్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి చొరబాటుదారులను బయటకు పంపిస్తామన్నారు. గతంలో మమతా బెనర్జీ మద్దతిచ్చిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఉగ్రవాదంపై ఎన్నడూ చర్యలు తీసుకోలేదని.. దానికి బదులుగా ఉగ్రవాదులకు బిర్యానీతో విందు ఇచ్చిందని ఆరోపించారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పహల్గాం దాడులకు ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బకొట్టిందన్నారు. రాత్రి సమయాల్లో మహిళలు బయట తిరగాల్సిన అవసరం ఏముందని ఒకప్పుడు మమత ప్రశ్నించారని అమిత్ షా పేర్కొన్నారు. అటువంటి మాటలు ఆమె పదవికే సిగ్గుచేటని అన్నారు. అర్ధరాత్రి కూడా మహిళలు ధైర్యంగా తిరిగే వాతావరణాన్ని తాము బెంగాల్‌లో సృష్టిస్తామన్నారు. ఆర్జీకర్ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## జీతం పెంచాలంటూ.. కార్మికుల ఆందోళన హింసాత్మకం



నోయిడా, ఏప్రిల్ 13: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ పరిశ్రమలో కనీస వేతనాలు అమలు చేయాలంటూ కార్మికులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. పరిశ్రమ ముందు కార్మికులు పెద్ద సంఖ్యలో గుమిగూడి రాళ్లు విసిరారు. కార్లు తగలబెట్టి, రహదారులను దిగ్బంధించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటనతో నోయిడాలోని రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీనిపై ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ "కార్మికులకు వారి హక్కులు దక్కి తీరాలి. పరిశ్రమలు వాటి చట్టాలను కచ్చితంగా పాటించాలి. కానీ కొంతమంది కార్మికులను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొడుతున్నారు. అలాంటి సంఘ విద్రోహ శక్తులను కఠినంగా శిక్షిస్తాం" అని హెచ్చరించారు. ఈ ఆందోళనలపై పారిశ్రామిక యూనిట్లతో తక్షణమే చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఇటీవల హరియాణా ప్రభుత్వం అసంఘటిత రంగంలో కార్మికులకు కనీస వేతనాన్ని 35శాతం పెంచుతూ ప్రకటనలు విడుదల చేసింది. ఈ క్రమంలోనే యూపీలో కార్మికులు ఆందోళనలకు దిగారు. వేతన పెంపుతో పాటు పని ప్రదేశంలో మెరుగైన పరిస్థితుల కోసం నిరసనలు చేపట్టారు. "పని ప్రదేశాల్లో మాకు భద్రత కల్పించాలి. యంత్రాంగాల కొరత, వారాంతాల సెలవుల సమస్యలను పరిష్కరించాలి" అంటూ నోయిడాలో కార్మికులు చేపట్టిన ఆందోళన హింసకు దారితీసింది. దీంతో పోలీసులు వారితో చర్చలు జరుపుతున్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అమలు చేయాలి : సుప్రీంలో పిటిషన్



దొంగఓట్ల కట్టడికి పోలింగ్ కేంద్రాల్లో ఐరిస్ బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ విధానాలు అమలు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈ అభ్యర్థనపై విచారణ జరిపేందుకు సుప్రీం అంగీకరించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఇటీవల ఎన్నికలు పూర్తికాగా.. తమిళనాడులో ఏప్రిల్ 23న, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న రెండు విడతల్లో ఓటింగ్ జరగనుంది. సుప్రీంకోర్టు వీటి గురించి ప్రస్తావిస్తూ.. ప్రస్తుత ఎన్నికలకు ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని వెల్లడించింది. "అయితే, రానున్న కాలంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో ఐరిస్ బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ విధానాలను అమలు చేయడం సరైందేనా కాదా..?అని పరిశీలించాల్సి ఉంది" అని పేర్కొంది. దీనికి సంబంధించి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల సంఘం స్పందించాలంటూ ఆదేశాలు జారీ చేసింది.

## అది రాజ్యాంగంపై దాడి: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ



న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల బిల్లు కంటే నియోజకవర్గాల పునర్విభజనే అత్యంత ముఖ్యమైన అంశమని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఆ పార్టీ పార్లమెంటరీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ అన్నారు. లోక్ సభలో సీట్లు పెంచేందుకు చేపట్టిన పునర్విభజన ప్రక్రియను రాజ్యాంగంపై చేస్తోన్న దాడిగా అభివర్ణించారు. అంతేగాక, ఎన్నికల సమయంలో 'నారీ శక్తి వందనం అధినియమ్' సవరణ బిల్లును తీసుకురావడంపైనా ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. "రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై కేంద్రం తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనలపై చర్చించేందుకు పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక సమావేశం ఏర్పాటు చేయాలి. ఈ ప్రతిపాదన గురించి ప్రతిపక్షం ఒకసారి కాదు ఇప్పటికే మూడు సార్లు కేంద్రానికి లేఖ రాసింది. అయినా అందరికీ ఉపయోగపడే ఈ అభ్యర్థనను ప్రధాని తిరస్కరించారు. దానికి బదులుగా ప్రధానమంత్రి సంపాదకీయాలు రాయడం, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తులు చేయడం, ఇతర సమావేశాలు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. నిర్ణయాలు తీసుకునే విషయంలో 'నా మాటే నెగ్గాలి' అన్నట్టు ప్రధాని వ్యవహరించడం విచారకరం. రాజకీయ లబ్ధి కోసమే ఎన్నికల వేళ ఈ అంశాలపై కేంద్రం పార్లమెంట్‌లో చర్చ చేపట్టాలని చూస్తోంది" అంటూ సోనియా గాంధీ విమర్శలు గుప్పించారు. "లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళా ఎంపీలకు 33 శాతం సీట్లు కేటాయించాలనే ఆలోచనను ప్రతిపక్షం వ్యతిరేకించడం లేదు. 2027 జనాభా లెక్కలకు ముందు జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మాత్రమే వ్యతిరేకిస్తున్నాం. అస్పష్టంగా అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడం మంచి పద్ధతి కాదు. 'నారీ శక్తి వందన అధినియమ్' సవరణ బిల్లును ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరిగే ప్రత్యేక సమావేశానికి బదులుగా, పార్లమెంట్ వర్షాకాల సమావేశంలోనే తీసుకురావాలి" అని సోనియా గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఇరాన్ శక్తి ఏంటో అమెరికాకు తెలుసు..!



ఇరాన్‌అమెరికా మధ్య ఘర్షణలపై భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫత్‌హలీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల అగ్రరాజ్యంతో జరిగిన చర్చలు విఫలమైనప్పటికీ.. తమ డిమాండ్లను అంగీకరిస్తే అమెరికాతో మరోసారి చర్చలకు సిద్ధమేనన్నారు. హర్మూజ్ జలసంధి ని దిగ్బంధిస్తామని అమెరికా చేసిన ప్రకటనపై స్పందిస్తూ.. జలసంధి ఇరాన్ ప్రాదేశిక జలాల్లోనే ఉందని.. ఆ జలాలపై తమ హక్కులను కాపాడుకుంటామన్నారు. ఇరాన్ ఏ విధంగా శాంతి చర్చలకు కట్టుబడి ఉందో.. అదే విధంగా సైనిక చర్యలకు కూడా సిద్ధంగా ఉందన్నారు. టెహ్రాన్ శక్తి ఏమిటో అమెరికాకు తెలుసని వ్యాఖ్యానించారు. భారత నౌకల నుంచి ఇరాన్ టోల్ వసూలు చేస్తోందన్న ఆరోపణలను ఆయన ఖండించారు. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించిన భారత నౌకలు ఇరాన్‌కు ఎటువంటి టోల్ చెల్లించలేదని తెలిపారు. దేశ ప్రజలు, జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం.. తమ ప్రతినిధి బృందం అమెరికా బృందంతో 21 గంటల పాటు చర్చలు జరిపిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అణు సమస్యలు, యుద్ధ నష్టపరిహారం, ఆంక్షల ఉపశమనం వంటి మూడు డిమాండ్లను తమ బృందం వారి ముందు ఉంచిందని.. అందుకు అగ్రరాజ్యం ఒప్పుకోకపోవడంతో చర్చలు విఫలమయ్యాయని తెలిపారు. తమ దేశంపై అమెరికాఇజ్రాయెల్‌లు సంయుక్తంగా చేసిన దాడుల్లో 3375 మంది పౌరులు మృతి చెందినట్లు తెలిపారు. ప్రాణ నష్టంతో పాటు గణనీయమైన ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

## మాజోలికొస్తే.. పర్షియన్ గల్ఫ్ రేవులను దిగ్బంధిస్తాం: ఇరాన్ హెచ్చరిక



హర్మూజ్ జలసంధి (Strait of Hormuz)ని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ చేసిన ప్రకటనపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.అంతర్జాతీయ జలాల్లో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించడం 'సముద్రపు దొంగతనం'తో సమానమని ఐఆర్‌జీసీ (IRGC) పేర్కొంది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే పర్షియన్ గల్ఫ్ ప్రాంతమంతటా సముద్ర భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించింది. అమెరికా తమ రేవులను దిగ్బంధిస్తే.. తాము గల్ఫ్ రేవులను మూసివేస్తామనింది. భద్రత ఉంటే అందరికీ ఉండాలని.. లేకపోతే ఎవరికీ ఉండకూడదని ఐఆర్‌జీసీ పేర్కొంది. హర్మూజ్ జలాల్లో భద్రతను పర్యవేక్షిస్తామని ఐఆర్‌జీసీ పేర్కొంది. తమ ఓడరేవులకు ముప్పు కలిగితే ఈ ప్రాంతంలో ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండదని వెల్లడించింది. శత్రు దేశాల నౌకలను జలసంధి గుండా వెళ్ళడానికి అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇరాన్ (Iran) అనుమతి పొందిన నౌకలకు మాత్రమే హర్మూజ్‌లోకి ప్రవేశించే వీలు కల్పిస్తామంది. హర్మూజ్‌పై నియంత్రణ కొనసాగించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.



## దిగ్బంధనం షురూ.. ఇరాన్‌కు ట్రంప్ మరో వార్నింగ్!

ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకున్నాయి. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తానని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో.. ఇరాన్ పోర్టుల వైపు వెళ్లి, వచ్చే అన్ని నౌకలను అమెరికా నౌకాదళం అడ్డుకోవడం ప్రారంభించింది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 7:30 గంటల నుంచి ఈ దిగ్బంధనం అమల్లోకి వచ్చింది. ఇందుకోసం అమెరికా నౌకాదళం భారీగా బలగాలను మోహరించింది. ఇరాన్ పోర్టుల్లోకి వెళ్లే.. బయటకు వచ్చే అన్ని దేశాల నౌకలను హర్మూజ్ వద్ద అడ్డుకుంటామని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. అదే సమయంలో ఇరానేతర పోర్టులకు వెళ్లి వచ్చే వాటికి అంతగా ఆటంకాలు కలిగించబోమని పేర్కొంది. ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్‌తో జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా అడ్డుకోవడం ప్రారంభించింది. మరోవైపు, ఓడరేవులు దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇప్పటికే ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామం మరోసారి ఉద్రిక్తతలను పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఇటువైపు వస్తే నాశనమే: ట్రంప్

ఇరాన్‌కు చెందిన 158 నౌకలను అమెరికా దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని ట్రంప్ అన్నారు. అవి ఇప్పుడు సముద్ర గర్భంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇరాన్ వద్ద ఉన్న ఫాస్ట్ అటాక్ షిప్స్‌ను ఇప్పటివరకు లక్ష్యంగా చేసుకోలేదని, వాటిని పెద్ద ముప్పుగా భావించడం లేదన్నారు. ఒకవేళ ఆ నౌకలు అమెరికా విధించిన దిగ్బంధనం వైపు వస్తే మాత్రం.. వాటిని వెంటనే నాశనం చేస్తామంటూ 'ట్రూత్ సోషల్'లో పోస్టు పెట్టారు. సముద్ర మార్గం ద్వారా అమెరికాలోకి వచ్చే డ్రగ్స్‌ను 98.2 శాతం వరకు నిలిపివేశామని, డ్రగ్ డీలర్లపై ఏ విధమైన కఠిన చర్యలు తీసుకుంటామో, ఇరాన్ నౌకల విషయంలోనూ అదే విధానాన్ని పాటిస్తామని స్పష్టం చేశారు.

## పశ్చిమాసియా సంక్షోభం ఎఫెక్ట్...

### నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



**ముంబై:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అయితే, ఇంట్రా డే కనిష్ఠాల నుంచి సూచీలు అనూహ్యంగా కోలుకున్నాయి. ముఖ్యంగా రక్షణ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడం మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 702.68 పాయింట్లు నష్టపోయి 76,847.57 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207.95 పాయింట్లు తగ్గి 23,842.65 వద్ద ముగిసింది.

రోజు ప్రారంభంలో భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు, రెండో అర్ధభాగంలో ట్రేడింగ్ పుంజుకోవడంతో నష్టాలను చాలా వరకు తగ్గించుకోగలిగాయి. పశ్చిమాసియాలో పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తుండటంతో మార్కెట్‌లో అప్రమత్తత కొనసాగింది. ఇది ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది.

రంగాల వారీగా చూస్తే, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాల షేర్లు కూడా బలహీనంగా ఉన్నాయి. అయితే, మెటల్ ఇండెక్స్ మిగతా రంగాలతో పోలిస్తే తక్కువ నష్టాలతో నిలిచింది. అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ రాణించడం గమనార్హం. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభపడగా, మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ వంటి షేర్లు 4.6 శాతం వరకు నష్టపోయాయి.

ప్రధాన సూచీల్లాగే బ్రాడర్ మార్కెట్లు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.54 శాతం, స్మాల్‌క్యాప్ 0.38 శాతం మేర నష్టపోయాయి. సాంకేతికంగా నిఫ్టీకి 23,900 వద్ద తక్షణ నిరోధం ఉందని, దిగువన 23,500 - 23,600 స్థాయిలు కీలక మద్దతు జోన్‌గా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఎయిరిండియా ఉద్యోగులకు టాటా బంపరాఫర్..

### పనితీరు ఆధారంగా కంపెనీ షేర్లు




**న్యూఢిల్లీ:** నష్టాల్లో ఉన్న విమానయాన సంస్థ ఎయిరిండియాను లాభాల బాట పట్టించేందుకు టాటా గ్రూప్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ పురోభివృద్ధిలో ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ, వారిలో ఉత్సాహం నింపేందుకు 'పెర్ఫార్మెన్స్-లింక్డ్ స్టాక్ ఆప్షన్స్ (పీఎస్ఓపీ) పథకాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. దీని ద్వారా ఉద్యోగుల ఉత్పాదకతను పెంచి, సంస్థ వృద్ధికి బాటలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సోమవారం లైవ్‌మింట్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం ఈ కొత్త పథకానికి 'పీఎస్ఓపీ 2026' అని పేరు పెట్టారు. ఫిబ్రవరి 13న జరిగిన సర్వసభ్య సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. ఈ ప్లాన్ కింద పైలట్లు, ఇంజనీర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ సహా అర్హులైన ఉద్యోగులకు కంపెనీ స్టాక్ ఆప్షన్లు కేటాయిస్తారు. ఉద్యోగులు ఈ షేర్లను రూ.4 ముఖ విలువ నుంచి, కేటాయింపు సమయంలోని మార్కెట్ విలువ మధ్యలో కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. "ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థల్లో ప్రస్తుతం, భవిష్యత్తులో పనిచేసే అర్హులైన ఉద్యోగుల పనితీరుకు ప్రతిఫలం ఇవ్వడం, సంస్థ వృద్ధికి, లాభదాయకతకు దోహదపడేలా వారిని ప్రేరేపించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రతిభావంతులను ఆకర్షించడం, నిలుపుకోవడం కూడా దీని లక్ష్యం" అని సమావేశ తీర్మానంలో పేర్కొన్నారు. ఏప్రిల్ 6న కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించిన వివరాల ప్రకారం ఈ పథకం కింద కంపెనీ మొత్తం షేర్ క్యాపిటల్‌లో 0.25 శాతానికి సమానమైన సుమారు 22.71 కోట్ల స్టాక్ ఆప్షన్లను కొత్త షేర్లుగా జారీ చేయనున్నారు. ఈ పథకంలో షేర్ల కేటాయింపునకు 1 నుంచి 5 సంవత్సరాల వెస్టింగ్ పీరియడ్ ఉంటుంది. అంటే ఉద్యోగులు దీర్ఘకాలం సంస్థతో కొనసాగేలా టాటా ప్రోత్సహిస్తోంది. అయితే, పనితీరు ఆధారంగానే షేర్ల కేటాయింపు ఉంటుంది. సంస్థ నిర్దేశించుకున్న అంతర్గత లక్ష్యాలలో 85 శాతం కంటే తక్కువ సాధిస్తే, ఉద్యోగులు కేవలం సగం షేర్లను మాత్రమే పొందే అవకాశం ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ఎవరికి, ఎన్ని షేర్లు, ఏ ధరకు కేటాయించాలనేది నామినేషన్, రెమ్యూనరేషన్ కమిటీ నిర్ణయిస్తుంది. ఇప్పటికే దేశంలోని లిస్టెడ్ ఎయిర్‌లైన్స్ అయిన ఇండిగో, స్పైస్‌జెట్, అలాగే ప్రైవేటు సంస్థ ఆకాశ ఎయిర్‌లలో ఇలాంటి ఉద్యోగుల స్టాక్ ఆప్షన్ పథకాలు అమల్లో ఉన్నాయి. 2022 జనవరిలో ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా గ్రూప్ కొనుగోలు చేసినప్పుడు కూడా దాదాపు 8,000 మంది ఉద్యోగులకు షేర్లను కేటాయించారు. ఇదిలా ఉంటే... ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ మార్చి 30న తన పదవికి రాజీనామా చేసినా, కొత్త వ్యక్తి బాధ్యతలు చేపట్టే వరకు కొనసాగనున్నారు. ఈ నాయకత్వ మార్పు సమయంలోనే కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## 2027 నుంచి కొత్త 'కేఫ్' నిబంధనలు..

### ఆటోమొబైల్ రంగానికి కేంద్రం భారీ ఊరట




**న్యూఢిల్లీ:** దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 2027 నుంచి 2032 మధ్య కాలానికి వర్తించే కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎఫిషియెన్సీ (జూఫీజు) నిబంధనలను సడలిస్తూ కొత్త ముసాయిదాను విడుదల చేసింది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ)తో సంప్రదింపులు జరిపి విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ సవరించిన ముసాయిదాను సిద్ధం చేసింది. గతంలో ప్రతిపాదించిన కఠినమైన లక్ష్యాల స్థానంలో దశలవారీగా నిబంధనలను కఠినతరం చేసే విధానాన్ని ప్రభుత్వం ఎంచుకుంది.

'కేఫ్-2027'గా పిలిచే ఈ కొత్త నిబంధనలు 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. 2032 ఆర్థిక సంవత్సరం వరకు క్రమంగా వీటిని కఠినతరం చేస్తారు. దేశ వాతావరణ, ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా ఆటోమొబైల్ రంగాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలో ఇది మూడో దశ. గతంలో 2025 సెప్టెంబర్‌లో విడుదల చేసిన ముసాయిదాతో పోలిస్తే తాజా ఫ్రేమ్‌వర్క్‌లో కంపెనీలకు మంచి వెసులుబాటు కల్పించారు.

కొత్త ముసాయిదాలో ఉద్గారాల లెక్కింపునకు సంబంధించిన ఫార్ములాను మార్చారు. దీనివల్ల గతంలో ప్రతిపాదించిన దానికంటే వాహనాలు కొంచెం ఎక్కువ ఇంధనాన్ని వినియోగించుకోవడానికి వీలు కలుగుతుంది. బరువైన వాహనాలకు గతంలో ఉన్న ప్రయోజనాన్ని తగ్గిస్తూ, అన్ని రకాల వాహనాలకు దాదాపు ఒకే విధమైన నిబంధనలను తీసుకురావడం ఈ ముసాయిదాలోని మరో ముఖ్యమైన అంశం.

ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలకు పెద్దపీట

ఈ కొత్త నిబంధనల్లో ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహం కల్పించింది. ఈ వాహనాలకు సూపర్ క్రెడిట్స్ ఇచ్చారు. దీని ప్రకారం ఒక కంపెనీ ఫ్లీట్ ఉద్గారాలను లెక్కించేటప్పుడు ఒక ఎలక్ట్రిక్ లేదా హైబ్రిడ్ కారును ఒకటి కంటే ఎక్కువ వాహనంగా పరిగణిస్తారు. ప్లగ్-ఇన్ హైబ్రిడ్, ఫ్లెక్స్-ఫ్యూయల్ హైబ్రిడ్ వాహనాలకు ఇంకా అధిక మల్టిప్లయర్‌లు లభించనున్నాయి.

## సన్‌రైజర్స్ కొత్త బౌలర్ల

# వికెట్ల జాతర...

### రాజస్థాన్‌పై అద్భుత విజయం

**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి, రాజస్థాన్ రాయల్స్‌పై 57 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌లో కెప్టెన్ ఇషాన్ కిషన్ మెరుపులు, ఆ తర్వాత బౌలింగ్‌లో కొత్త ముఖాలు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ మాయాజాలంతో సన్‌రైజర్స్ అద్భుత ప్రదర్శన చేసింది.

సన్‌రైజర్స్ నిర్దేశించిన 217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్ వేసిన ప్రఫుల్ హింగే... రెండో బంతికి వైభవ్ సూర్యవంశీ (0), నాలుగో బంతికి ధ్రువ్ జురెల్ (0), ఆరో బంతికి ప్రిటోరియస్‌ను (0) పెవిలియన్‌కు పంపాడు. ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి రాజస్థాన్‌ను





కోలుకోలేని దెబ్బ తీశాడు.

ఆ వెంటనే రెండో ఓవర్లో యశస్వి జైస్వాల్ (1)ను సాకిబ్ హుస్సేన్ ఔట్ చేయగా, తన తర్వాతి ఓవర్లో కెప్టెన్ రియాన్ పరాగ్ (4)ను కూడా హింగే పెవిలియన్ చేర్చాడు. దీంతో రాజస్థాన్ కేవలం 9 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

ఈ దశలో డోనోవాన్ ఫెరీరా (44 బంతుల్లో 69; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), రవీంద్ర జడేజా (32 బంతుల్లో 45; 5 ఫోర్లు) అద్భుతంగా పోరాడారు. ఆరో వికెట్‌కు 118 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరి పోరాటంతో రాజస్థాన్ గెలుపుపై కొద్దిసేపు ఆశలు రేకెత్తాయి.

అయితే, ఈ జోడీని సాకిబ్ హుస్సేన్ విడదీయడంతో రాజస్థాన్ పతనం మళ్లీ మొదలైంది. చివర్లో తుషార్ దేశ్‌పాండే (11 బంతుల్లో 25; 3 సిక్సర్లు) మెరుపులు మెరిపించినా, అప్పటికే ఆలస్యమైంది. ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ చెరో 4 వికెట్లతో రాజస్థాన్ పతనాన్ని శాసించారు. ఎషాన్ మలింగ 2 వికెట్లు పడగొట్టాడు. చివరకు రాజస్థాన్ 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది.

అంతకుముందు, టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ ప్రారంభించింది. తొలి ఓవర్లోనే అభిషేక్ శర్మ (0) డకౌట్‌గా వెనుదిరిగినా, కెప్టెన్ ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 91; 8 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగాడు. రాజస్థాన్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తించాడు. శతకానికి చేరువలో అతను ఔటయ్యాడు.

ఆ తర్వాత హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్సర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (13 బంతుల్లో 28; 4 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. ముఖ్యంగా నితీశ్ తన చిన్న ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు బాది స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో సలీల్ అరోరా (13 బంతుల్లో 24) కూడా రాణించడంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు తీశాడు. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ తన తదుపరి మ్యాచ్ ను ఈ నెల 18న చెన్నై సూపర్ కింగ్స్ తో సొంతగడ్డపై ఆడనుంది.



## డగౌట్‌లో సెల్‌ఫోన్.. రాజస్థాన్ రాయల్స్

# టీమ్ మేనేజర్‌కు బీసీసీఐ నోటీసులు

**గౌహతి:** రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి బిందర్ చిక్కుల్లో పడ్డారు. గత శుక్రవారం ఆర్సీబీతో మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఆయన డగౌట్‌లో సెల్‌ఫోన్‌తో కనిపించారు. ఈ ఘటన పట్ల బీసీసీఐ సీరియస్‌గా ఉంది. రోమి బిందర్‌కు ఇవాళ బీసీసీఐ నోటీసులు జారీ చేసింది. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడినట్లు బిందర్‌పై



ఆరోపణలు వస్తున్నాయి. టీమ్ డగౌట్‌లో ప్లేయర్లు ఉండే ప్రదేశంలో మేనేజర్ రోమి బిందర్ సెల్‌ఫోన్ చూస్తున్నట్లు దృశ్యాలు రిలీజ్ అయ్యాయి. పక్కనే కూర్చుకున్న వైభవ్ సూర్యవంశీ .. అతని ఫోన్‌ను తీక్షణంగా చూస్తున్నట్లు ఆ వీడియోలో ఉన్నది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో వివాదం ముదిరింది. దీనిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఐపీఎల్ చైర్మన్ లలిత్ మోదీ కూడా డిమాండ్ చేశారు.

బీసీసీఐకి చెందిన యాంటీ కరప్షన్ అండ్ సెక్యూర్టీ యూనిట్(ఏసీఎస్‌యూ) రోమి బిందర్‌కు నోటీసులు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా ఈ చర్యకు పాల్పడింది. అయితే 48 గంటల్లో ఆయన తన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దేని కోసం రోమి బిందర్ డగౌట్ ఏరియాలో ఫోన్ పట్టుకున్నారో తన వివరణలో చెప్పాల్సి ఉంటుంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని ఏసీఎస్‌యూ విభాగాన్ని ఆదేశించామని, దీనిపై నివేదికను ఇవ్వాలని కోరినట్లు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ అరుణ్ ధుమాల్ ఓ మీడియాతో తెలిపారు. అయితే ఆరోగ్య కారణాల కోసం బిందర్ ఫోన్ వాడి ఉంటారని భావిసత్ఉన్నారు.

గతంలో ఆర్ఆర్ టీమ్ మేనేజర్‌కు ఆరోగ్య సమస్యలు ఎదరయ్యాయి. నాగపూర్‌లో ఓసారి ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. మెడికల్ కారణాల చేత ఆయన తన ఫోన్‌కు డగౌట్‌కు తీసుకెళ్లే వీలు ఉంది, కానీ అక్కడ కూర్చుని ఫోన్‌ను వాడరాదు అని నియమావళి ఉన్నట్లు తెలుస్తోంది. రోమి ఇటీవల 10 కిలోల బరువు తగ్గినట్లు కొన్ని రిపోర్టుల ద్వారా తెలిసింది. అయితే రోమి మెడికల్ కండీషన్‌ను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ అధికారులు చర్యలు తీసుకుంటారని చెబుతున్నారు.

## భారత క్రికెట్‌ను గ్యారీ కిర్‌స్టెన్ మార్చేశాడు..

### అతని కోచింగ్ వల్లే టీమిండియా దశ తిరిగింది: యువీ

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. 2008 నుంచి 2011 మధ్య కాలంలో భారత జట్టు సాధించిన విజయాల్లో కిర్‌స్టెన్ కీలక పాత్ర పోషించాడని, అతని కోచింగ్ విధానం జట్టు రూపురేఖలనే మార్చేసిందని యువీ గుర్తుచేసుకున్నాడు. ముఖ్యంగా ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపి, వారిని నడిపించిన తీరు అద్భుతమని కొనియాడాడు.

ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్‌తో 'స్టిక్ టు క్రికెట్' అనే పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ యువరాజ్ ఈ విషయాలను పంచుకున్నాడు. కిర్‌స్టెన్ కోచింగ్‌లో భారత జట్టు ఎదిగిన తీరును వివరిస్తూ... "ఆ సమయంలో గ్యారీ కిర్‌స్టెన్ ప్రభావం చాలా ఉంది. మాకు అప్పుడు కావాల్సింది ఒక మంచి వ్యక్తి. మైదానంలో జట్టుగా మెలగాలని చెప్పే వ్యక్తి అవసరం. గ్యారీ ఆ పాత్రను సంపూర్ణంగా పోషించాడు. అతను చాలా కష్టపడి పనిచేసేవాడు" అని తెలిపాడు.

కిర్‌స్టెన్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజునే తమతో చెప్పిన మాటలను యువరాజ్ గుర్తుచేసుకున్నాడు. "కోచ్‌గా వచ్చిన తొలిరోజే, రాబోయే నాలుగేళ్లలో టెస్టులు, వన్డేలు, టీ20లు.. ఇలా మూడు ఫార్మాట్లలోనూ మనం నంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని గ్యారీ చెప్పాడు. ఆయన మాటలు విని కొందరు



ఆటగాళ్లు ఒకరినొకరు చూసుకున్నారు. 'ఏంటి ఈయన చెప్పేది?' అని ఆశ్చర్యపోయారు. కానీ, ఆస్ట్రేలియా ఆధిపత్యం కొనసాగుతున్న రోజుల్లోనే, అతను చెప్పినట్లు నాలుగేళ్లలో మేము ఆ ఘనత సాధించాం. అతని ఉద్దేశం చాలా గొప్పది. భారత క్రికెట్‌ను కిర్‌స్టెన్ మరో స్థాయికి తీసుకెళ్లాడు" అని యువరాజ్ వివరించాడు.

కోచ్ ఇచ్చే భరోసా ఆటగాళ్లపై ఎంత ప్రభావం చూపుతుందో యువీ తన సొంత అనుభవంతో చెప్పాడు. "గ్యారీ ఎప్పుడూ నాతో, 'నువ్వొక గేమ్ ఛేంజర్. నా మ్యాచ్ విన్నర్ నువ్వే. నువ్వు ఎన్నిసార్లు విఫలమయ్యావన్నది నాకు అనవసరం. వెళ్లి మన కోసం మ్యాచ్ గెలిపించు' అని చెప్పేవాడు. ఈ మాటలు నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. జట్టు, కోచ్ నాపై నమ్మకం ఉంచారని అర్థమైంది. 'నువ్వు 20-25 ఓవర్లు బ్యాటింగ్ చేస్తే ఆట స్వరూపమే మారిపోతుంది. వెళ్లి నీ సహజమైన ఆట ఆడు' అని ప్రోత్సహించేవాడు. అతను ఇచ్చిన ఆత్మవిశ్వాసంతోనే నేను స్వేచ్ఛగా ఆడగలిగాను" అని యువీ పేర్కొన్నాడు.

## మహిళల టీ20 వరల్డ్‌కప్..

# 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసీసీ

**దుబాయ్:** ఈ ఏడాది జూన్‌లో మహిళల టీ20 వరల్డ్‌కప్ జరగనున్నది. దీని కోసం ఇవాళ ఐసీసీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచేసింది. రెండు నెలల పాటు ఇంగ్లండ్, వేల్స్‌లో జరిగే వరల్డ్‌కప్ కోసం సుమారు 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది ఐసీసీ. గత ఎడిషన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఈసారి ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ జరగనున్నది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆడుతారు. గత వరల్డ్‌కప్‌లో ప్రైజ్‌మనీ 74 కోట్లు కాగా, ఈసారి 82 కోట్లు ఇవ్వనున్నారు. వరల్డ్‌కప్ విజేతలు ఈసారి 21.8 కోట్ల ప్రైజ్‌మనీ గెలుచుకుంటారు. ఇక రన్నరప్‌కు 10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్లోకి ఎంటరైన జట్లకు 6.29 కోట్లు ఇవ్వనున్నారు. ఇక గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకు 29 లక్షలు ఇవ్వనున్నారు. ప్రతి జట్టుకు కనీసం రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది. జూన్ 12వ తేదీన బర్మింగ్‌హామ్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్ , స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు ఆడనున్నారు.



MOVIE TIME

## కండలు పెంచి..
# కొత్త లుక్‌లో ఎన్టీఆర్
### డ్రాగన్ కోసం ఎన్టీఆర్ కసరత్తులు



**టాకీస్:** జూనియర్ ఎన్టీఆర్ , స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్‌పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ న్యూ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. తాజాగా బయటకు వచ్చిన లుక్‌లో ఎన్టీఆర్ కండలు తిరిగిన దేహంతో, బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. సన్నని నడుముతో క్లాసిక్ బ్యాక్ డబుల్ బైసెప్స్ పోజ్‌లో ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవర్‌ఫుల్ యాక్షన్ పాత్ర కోసం ఎన్టీఆర్ కఠినమైన ట్రైనింగ్, ప్రత్యేక డైట్‌ను ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ ఇది కష్టపడి తెచ్చుకున్న కండలు..కొన్నవి కావు.. అని ఆయన రాసిన క్యాప్షన్ కూడా వైరల్ అవుతోంది. ఇటీవల ఎన్టీఆర్ లుక్‌పై కొంత అసంతృప్తి ఏర్పడిందని, దాని వలన షూటింగ్ నిలిచిపోయిందంటూ ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే దీనిపై చిత్ర నిర్మాతలు స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇది కేవలం రెగ్యులర్ షెడ్యూల్ బ్రేక్ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ అనుకున్న ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే జోర్డాన్‌లో ఒక షెడ్యూల్ పూర్తయినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ప్రాంతంలో కూడా కీలక సన్నివేశాలు చిత్రీకరించినట్లు తెలుస్తోంది.

## ఏ పర్ఫెక్ట్ మ్యాచ్ సిరీస్‌లో ఆకట్టుకుంటున్న సారా అర్జున్ -ఇషాన్ ఖట్టర్



**టాకీస్:** ప్రస్తుతం సోషల్ మీడియా మొత్తం ఒకే జంట గురించి చర్చించుకుంటోంది. అదే సారా అర్జున్ -ఇషాన్ ఖట్టర్. వీరిద్దరూ కలిసి నటించిన మైక్రో సిరీస్ 'ఏ పర్ఫెక్ట్ మ్యాచ్' ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. కేవలం కొన్ని ఎపిసోడ్లతోనే ఈ జంట ఇంటర్నెట్‌లో మోస్ట్ ఫేవరెట్ జోడీగా మారిపోవడం విశేషం. ప్రముఖ దర్శకురాలు జోయా అక్తర్ సహకారంతో రూపొందిన ఈ సిరీస్‌లో ప్రేమకథను ఒక కొత్త కోణంలో చూపించారు. నిత్యజీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనలను సెర్చ్ ఇంజిన్ కాన్సెప్ట్‌తో మేళవిస్తూ కథను నడిపించడం ఈ సిరీస్ ప్రత్యేకత. ఇప్పటివరకు విడుదలైన ఎపిసోడ్లు మంచి స్పందనను రాబట్టగా? ప్రతి ఎపిసోడ్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. ముఖ్యంగా సారా -ఇషాన్ మధ్య ఉన్న నేచురల్ కెమిస్ట్రీ ఈ సిరీస్‌కు ప్రధాన బలం.

## సమ్మర్‌లో మూడు కొత్త సినిమాలు

**టాకీస్:** ఈ వేసవి వేడిలో ప్రేక్షకులకు కూల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు టాలీవుడ్‌లో చిన్న సినిమాలు సిద్ధమవుతున్నాయి. విలేజ్ కామెడీ ఎంటర్‌టైనర్స్ నుంచి ప్రేమ కథల వరకు విభిన్న జానర్లతో థియేటర్లలో సందడి చేసేందుకు కొన్ని ఆసక్తికర చిత్రాలు ఏప్రిల్ మూడో వారంలో విడుదలకు రెడీ అయ్యాయి.



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా పరిచయం అవుతున్న తొలి చిత్రం తిమ్మరాజుపల్లి టివి. 90ల నాటి నేపథ్యంలో రూపొందిన ఈ విలేజ్ కామెడీ ఎంటర్‌టైనర్ అప్పటి జీవనశైలిని, గ్రామీణ వాతావరణాన్ని గుర్తు చేసేలా ఉండబోతోంది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దాదాపు కొత్త నటీనటులతో ఈ సినిమాను తెరకెక్కించారు. సాయితేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతుండగా, దర్శకుడు వి. మునిరాజు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరో తిరువీర్ నటిస్తున్న తాజా చిత్రం పాపం ప్రతాప్. ఈ సినిమాలో పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట జీవితంలో కేవలం నాలుగు రోజుల్లోనే ఎదురయ్యే సమస్యల చుట్టూ కథ తిరుగుతుందని సమాచారం. దర్శకుడు ఎస్పీ దుర్గా నరేశ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో అజయ్ ఘోష్, రఘుబాబు, ప్రసాద్ బెహర వంటి నటులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా కూడా ఏప్రిల్ 17న విడుదల కానుంది. యువ హీరో నాగశౌర్య నటించిన 'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రం ఈ వారం ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు రామ్ దేశినా తెరకెక్కించిన ఈ యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో హీరోయిన్‌గా విధి నటించింది. దాదాపు మూడు సంవత్సరాలుగా నిర్మాణంలో ఉన్న ఈ సినిమా చివరికి విడుదలకు సిద్ధమైంది. ఏప్రిల్ 17న థియేటర్లలో రిలీజ్ కానుండగా, యూత్ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అంశాలతో రూపొందిన ఈ మూవీపై మంచి అంచనాలు ఉన్నాయి. ఇదే రోజున 'తెరచాప' అనే మరో చిన్న సినిమా కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం పెద్ద సినిమాల మధ్య చిన్న సినిమాలకు అవకాశాలు తగ్గుతున్నప్పటికీ, మంచి కథ, సహజమైన నటన ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారని మేకర్స్ నమ్ముతున్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, యూత్‌ను టార్గెట్ చేస్తూ ఈ సినిమాలు తెరకెక్కడం విశేషం. ఏప్రిల్ మూడో వారం థియేటర్లలో చిన్న సినిమాల సందడి మొదలవుతుండగా, వీటిలో ఏ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి.



# మనసుకు నచ్చిందే చేస్తున్నా..: తమన్నా


టాకీస్: తమన్నా ఇప్పుడేం చేస్తున్నారు? పెద్దగా కనిపించడం లేదే.. అని సౌత్ ఆడియన్స్ అనుకునేలోపు... నేనొచ్చేశా అంటూ స్పెషల్ స్టేట్‌మెంట్స్ తో వార్తల్లో తళుక్కుమంటున్నారు మిల్కీబ్యూటీ. సినిమా పతప్ప నాకు వేరే యావ లేదంటున్నారు. కెరీర్‌లో గ్యాప్ వచ్చిన వాళ్లో, కావాలని స్పేస్ తీసుకుని మళ్లీ రీస్టార్ట్ చేసిన వాళ్లో... కెరీర్‌ని మళ్లీ ప్రారంభిస్తున్నట్టుగా ఉంది అని అంటారు. కానీ, ఇప్పుడు ఈ మాటను తమన్నా చెబుతున్నారు. సినిమా కెరీర్ స్టార్ట్ అయిన తర్వాత ఆమె ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇన్‌స్టంట్‌గా వైరల్ అవుతోంది. నేను నటించిన సినిమాలన్నీ వరుసగా రిలీజ్ అవుతున్నాయి. ఏ నటికైనా కెరీర్ స్టార్ట్ అయిన 21 ఏళ్ల తర్వాత ఇంత బిజీగా ఉండటం అదృష్టం. నేను ఆ విషయంలో చాలా లక్కీ ఫెలో... దక్షిణాది పరిశ్రమలో నాకు లభిస్తున్న ఆదరణ చూసి ఆనందంగా ఉంది. అందుకే నేను కూడా సరికొత్త కథలకు, ప్రయోగాత్మక చిత్రాలకు నో చెప్పకుండా ఓకే చేస్తున్నా అని అంటున్నారు తమన్నా. ఎప్పటికప్పుడు కెరీర్‌ని షేప్ చేసుకోవడంలో తమన్నా సూపర్ సక్సెస్ అవుతున్నారన్నది క్రిటిక్స్ మాట. తమన్నా చెప్పినట్టే రెండు దశాబ్దాలుగా ఆమెను సౌత్ ఆడియన్సే ఆదరించారు. సౌత్ ఫ్యామిలీస్‌లో నేనో మెంబర్‌ని అని మిల్కీ బ్యూటీ చెప్పడంలో తప్పేమీ లేదు అన్నది అబ్జర్వర్స్ మాట. ఓ వైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలు, స్పెషల్ సాంగులు, ఓటీటీ కథలతో బంపర్ గర్ల్ అనిపించుకుంటున్నారీ లేడీ. ఆ మధ్య ప్రేమ వ్యవహారంతో కాస్త డీవియేట్ అయినట్టు అనిపించినా, ఇప్పుడు రెట్టింపు ఫోకస్‌తో కెరీర్ ని మలచుకుంటున్నారు. ఇదే కాన్‌సెన్‌ట్రేషన్ ఉంటే గనుక, సౌత్‌లో నయన్‌కి తమన్న మంచి పోటీ అవుతారనే మాట కూడా ఉంది.

## రణబాలి సెట్స్‌లోకి అడుగుపెట్టిన
# విజయ్ దేవరకొండ, రష్మిక



**టాకీస్:** 'రణబాలి' చిత్రంతో జంటగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ దేవరకొండ - రష్మిక. వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం విజయ్ - రష్మిక తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ ఇద్దరూ వైవాహిక బంధంలోకి అడుగు పెట్టాక కలిసి సెట్‌లోకి రావడం ఇదే తొలిసారి కావడంతో చిత్ర బృందం వారికి స్వాగతం పలికి.. కేక్ కట్ చేయించింది. 1854 - 1978 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. విజయ్ దీంట్లో టైటిల్ పాత్ర పోషిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తోంది. ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలోకి రానుంది.
ఈ చిత్రానికి సంగీతం: అజయ్ - అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.

## భరతవర్ష్ మూవీతో
# వస్తోన్న గోపీచంద్




**టాకీస్:** యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.